ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025



రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం- 2 పథకం ప్రయోజనం జిల్లాలో అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. కిందటేడాది అక్టోబరు 31, దీపావళి రోజున రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం ప్రవేశపెట్టి నాలుగు నెలలవుతున్నా ఇప్పటి వరకూ మూడింట రెండోవంతు మందికి మాత్రమే ఉచిత సిలిండర్లు అందాయి. మరో నెలరోజుల్లో గడువు పూర్తి కానున్న నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

దీపం-2కు

సాంకేతిక చిక్కులు

- మూడు జిల్లాల్లో 17లక్షల రేషన్ కార్డులు
- ఇప్పటి వరకూ 12 లక్షల మందికే రాయితీ
- మరో నెలరోజుల్లో ముగుస్తున్న తొలి విడత గడువు




రేషన్ కార్డులు లేక.. రెండు లక్షలమందికి అనర్హత

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరుజిల్లాలో 5,85,942 రేషన్‌కార్డులు కలిగి ఉన్న లబ్ధిదారులు దీపం- 2 పథకానికి అర్హత సాధించగా, ఇప్పటి వరకూ 3,97,000 మంది మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకున్నారు. వారిలో 3,95,000 మందికి మాత్రమే గ్యాసు సిలిండర్ డబ్బు అందింది. కాగా ఇంకా లక్షా 90వేల మందికి ఉచిత సిలిండరు పథకం ప్రయోజనం అందలేదు. బాపట్ల జిల్లాలో 4,86,029 రేషన్ కార్డులు ఉండగా వారిలో 4,58,000 మందికి గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. వారిలో ఇప్పటి వరకూ 3,53,461 మందికి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయి. కాగా లక్షా 4వేల 539 మందికి ఇంకా ఈ పథకం దక్కలేదు. పల్నాడు జిల్లాలో 6,45,110 రేషన్ కార్డులు ఉండగా అందులో 4లక్షల మంది మాత్రమే ఇప్పటి వరకూ ఉచిత గ్యాసు సిలిండర్ పొందారు. మిగిలిన రెండున్నర లక్షల మందికి ఇంకా ఉచిత సిలిండర్ దక్కలేదు. నాలుగు నెలల్లో కేవలం 12 లక్షలమందికి మాత్రమే ఉచిత సిలిండర్ అందగా, మరో 38 రోజుల్లో ఐదు లక్షల మందికి ఉచిత సిలిండర్లు అందాల్సి ఉంది. ఇంత తక్కువ సమయంలో అంత ఎక్కువ మందికి అవకాశం లభిస్తుందా లేదా అన్నదే సగటు వినియోగదారుణ్ణి వెంటాడుతున్న ప్రశ్న. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

● రేషన్ కార్డులు లేక 2 లక్షల మందికి అనర్హత

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 19.5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, రేషన్ కార్డులు మాత్రం 17.31లక్షలు మాత్రమే వున్నాయి. పై గణాంకాల ప్రకారం జిల్లాలో 2.19 లక్షల గ్యాస్ కనెక్షన్లకు రేషన్ కార్డులు లేవు. దీంతో వారంతా ఈ పథకానికి అనర్హులు అయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. పాత రేషన్ కార్డులను విభజించడంగానీ, మార్పు చేర్పులు చేయడంగానీ లేకపోవడంతో ఐదేళ్లుగా వారికి రేషన్ కార్డులు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఇప్పటికి 8 నెలలు పూర్తవుతున్నా ఈరోజు వరకూ వారికి రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయింది. అన్ని పథకాలకు ప్రామాణికమైన రేషన్ కార్డు లేకపోవడంతో జిల్లాలో రెండు లక్షల మందికి లేవు దీంతో దాదాపు రెండున్నర లక్షల మంది అనర్హత బారిన పడ్డారు. వీరంతా రేషన్ కార్డు నిబంధనను తొలగించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దాంతో వారంతా ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఇప్పుడు అర్హులైనవారిని కూడా సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి.



● సాంకేతిక చిక్కులు..

బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాకపోవడం, లబ్ధిదారునికి రెండు మూడు బ్యాంకుల్లో ఖాతాలుండడం, గ్యాస్ కనక్షన్‌కు ఇచ్చే ఖాతా నంబర్‌తో ఈకేవైసీ పూర్తి కాకపోవడంతో చాలా మంది రాయితీకి దూరమవుతున్నారు. ఒక కుటుంబంలో గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరున ఉంటుంది.. సిలిండర్ వినియోగించే వారు మరొకరు ఉంటారు. కనెక్షన్ ఉన్నవారికే గ్యాస్ సొమ్ము వాపస్ వస్తుంది. ఈ తరహా సమస్యలతో అనేకమంది ఉచిత సిలిండర్ ప్రయోజనం కోల్పోతున్నారు.

● కాల్ సెంటర్ల ఏర్పాటు..

ఉచిత సిలిండర్ డబ్బులు పడకపోతే వివరాలు తెలుసుకోవడానికి అన్ని పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఆధార్, గ్యాస్ కనెక్షన్ నంబర్ చెబితే సరిపోతుంది. అలా రాలేనివారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి తమ సమస్యను చెబితే వారు సంబంధిత అధికారులకు సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపే అవకాశం ఉంటుంది. ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచిస్తున్నారు.



- పీఎం స్వానిధి పేరుతో క్రెడిట్ కార్డులు
- ఇటీవల బడ్జెట్లో అదనపు కేటాయింపులు
- రుణ పరిమితి 50,000ల వరకు పెంపు
- తీరనున్న అధిక వడ్డీ కష్టాలు
- మూడు జిల్లాల పరిధిలో 60,000 మంది వరకు లబ్ధి

చిరు వ్యాపారులకు ఊరట!

పట్టణాల్లో వీధి వ్యాపారులు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వాటిని తీర్చే మార్గం తెలియక ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొనేవారు. వీటి నుంచి వారిని బయటపడేయడానికి కేంద్రం పీఎం స్వానిధి పేరుతో క్రెడిట్ కార్డులు మంజూరు చేసే విధంగా ప్రణాళికలు రచిస్తోంది. గతంలో చిరు వ్యాపారులకు పీఎం స్వానిధి పేరిట తొలి విడతలో పదివేల రుణాన్ని కేంద్రం మంజూరు చేసింది. మెప్మా వద్ద నమోదు అయిన వీధి వ్యాపారులకు దీనిని వర్తింప చేసింది. తాజాగా కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో రుణపరిమితిని రూ.30,000, 50,000కు పెంచి దశల వారీగా వీధి వ్యాపారులకు అందిస్తామని కేంద్రం ప్రకటించడం చిరు వ్యాపారులకు ఊరట నిచ్చింది. ఎండనక వాననక వ్యాపారం చేసి సంపాదించిన డబ్బు వడ్డీల రూపంలో వెళ్లిపోయేదని, ఇప్పుడు వడ్డీ లేకుండా కేంద్రం రుణాలు ఇవ్వడం పట్ల చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పీఎం స్వానిధి పథకం కింద బాపట్ల జిల్లాలో 12,000 మంది పట్టణ వీధి వ్యాపారులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరనుండగా, పల్నాడు జిల్లాలో 15,000, గుంటూరు జిల్లాలో 33,000 మంది వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి క్రెడిట్ కార్డులు అందనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలయింది. గతంలో పదివేల రుణం తీసుకుని సకాలంలో కట్టిన వారంతా తర్వాత దశలో భాగంగా 30,000 రుణం పొందే క్రెడిట్‌కార్డు అర్హత సాధించారు. ఈ కేటగిరిలో కూడా ఇప్పటికే దాదాపు 25,000 మంది వడ్డీలేని రుణాలు తీసుకోనున్నారు. తర్వాత దశలో చిరు వ్యాపారులకు రూ.50,000 వరకు వడ్డీలేని రుణాలు అందించనున్నారు

కుదేలయిన చిరు వ్యాపారాలను గాడిలో పెట్టడానికి...

గత ప్రభుత్వంలోనే కేంద్రం పదివేల రుణ సహాయాన్ని వడ్డీలేకుండా వీధి వ్యాపారులకు అందించింది. కానీ ఈ నిధులను సైతం పక్కదారి పట్టించి అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందకుండా చేసిన ఘనతను వైసీపీ మూటగట్టుకుంది. పైగా ఆ రుణాలను కూడా ఇష్టారీతిన అనర్హులకు దోచిపెట్టినట్లు అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో చిరు వ్యాపారులు అధిక వడ్డీల కోసం దళారులను ఆశ్రయించాల్సి రావడంతో ఆర్థికంగా వారంతా చితికిపోయారు. దీనికి తోడు స్థానికంగా ఉండే నేతలకు జే ట్యాక్స్ కట్టలేక అసలు వ్యాపారాలనే మానేసిన వారు ఉన్నారు. అన్ని విధాలుగా వీధి వ్యాపారులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం పీఎం స్వానిధి పేరిట రుణ సహాయం చేయడానికి పూనుకుంది

కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా...

వీధి వ్యాపారులు నేరుగా పీఎం స్వానిధి పోర్టల్‌లో కాని వారికి దగ్గరలో ఉన్న సీఎస్‌సీల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించే చిరు వ్యాపారులకు కేంద్రం ప్రోత్సాహకాలు కూడా అందిస్తుంది. దీనిలో భాగంగా 7 శాతం వరకు సబ్సిడీతో పాటు ఏడాదికి రూ.1,200 వరకు క్యాష్ బ్యాక్‌ను కూడా అందిస్తుంది. తీసుకున్న రుణాలపై ఎలాంటి అదనపు చార్జీల వడ్డన లేకపోవడంతో పాటు రుణాన్ని ముగించేటప్పుడు ఎలాంటి చార్జీలను వసూలు చేయకుండా వారి ప్రయోజనాలను కేంద్రం కాపాడుతోంది

పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక

వడ్డీలేని రుణాలను అందుకునే అర్హులైన వీధి వ్యాపారులను ఎంపిక చేసే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకున్నాయి. పీఎం స్వానిధికి అర్హత సాధించాలంటే సదరు వీధి వ్యాపారి పేరు మెప్మా విభాగం వద్ద రిజిష్టర్ అయి ఉండాలి. ఇందుకోసం గతంలోనే సిబ్బంది ఫీల్డ్ విజిట్ చేసి పేర్లు నమోదు చేసుకున్నారు. అర్హత ఉండి రుణం అందుకోని వారికి నేరుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కూడా మెప్మా కల్పించింది.

గతంలో జరిగిన సర్వేపై పలు అనుమానాలు

కరోనా కారణంగా దెబ్బతిన్న చిరు వ్యాపారులను ఆదుకునేందుకు కేంద్రం ఆసమయంలో వారిని ఆదుకునేందుకు పదివేల రూపాయల రుణ సాయాన్ని వడ్డీలేకుండా అందించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే రుణాన్ని 50,000 వరకు పెంచే విధంగా తాజా బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. కరోనా సమయంలో వీధి వ్యాపారుల లెక్క తేల్చే బాధ్యతను మెప్మాకు ప్రభుత్వాలు అప్పజెప్పాయి. వైసీపీ ప్రభుత్వంలో మితిమీరిన రాజకీయ జోక్యంతో ఈ జాబితా అంతా కూడా నేతల అనుచరగణం తోనే నిండిపోయిందని, అర్హత కలిగిన వీధి వ్యాపారులు 60 శాతానికి మించి ఉండరనే ఆరోపణలు గతంలోనే వచ్చాయి. కానీ గత ప్రభుత్వంలో ఆ జాబితా ఆధారంగానే రుణాలు అందించారు. ప్రస్తుతం కూడా అదే ప్రామాణికంగా పరిమితి పెంచి మరీ క్రెడిట్ కార్డులు అందించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. మొత్తం జాబితాను జల్లెడ పడితే వీధి వ్యాపారులు కాని ఎంతోమంది రుణాలు అందుకుంటున్న వైనం వెలుగులోకి వస్తుందనేది అర్హులైన వారి వాదనగా ఉంది. పారదర్శకంగా సర్వే చేయడం వలన అనర్హులు తొలగించబడతారని, తద్వారా అర్హులైన మరికొంత మందికి ఈ పీఎం స్వానిధి ఫలాలు అందుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సత్తెనపల్లి పోలీసులను అభినందించిన హోం మినిస్టర్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పోలీసులను హోం మినిస్టర్ వంగలపూడి అనిత గురువారం ఫోన్‌లో అభినందించారు. ఎన్‌టీఆర్ జిల్లా గన్నవరంలో ఒక ప్రముఖ కళాశాలలో చదివే ఐదుగురు మైనర్ విద్యార్థినులు మిస్సింగ్ అయ్యారని బుధవారం సాయంత్రం గన్నవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదు మేరకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణి, ఏఎస్ఐ రమణ తమ సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి వరకు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ట్రైయిన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు విద్యార్థినులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని వారిని సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో దించి వేశారు. అనంతరం గన్నవరం పోలీసులకు సమాచారం అందించి ఐదుగురు విద్యార్థినులను వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయంలో రాష్ట్ర హోం మినిస్టర్ సత్తెనపల్లి పోలీసులకు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద

భద్రత కట్టుదిట్టం

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ఏడాదిలో హైవే నిర్మాణ పనులు పూర్తి

- ఎన్‌హెచ్ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్

8

పోలింగ్ సిబ్బందికి సామగ్రిని

సక్రమంగా అందించండి

- ఆర్వో నాగలక్ష్మి ఆదేశాలు

8



గుంటూరు: ఏసీ కళాశాలలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్ తేజ



8

ముస్తాబవుతున్న క్రీడా ప్రాంగణం

ఆట స్థలాలకు మహర్దశ

- పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాగుపడిన క్రీడా ప్రాంగణాలు
- రాష్ట్రంలో 484 పాఠశాలలకు రూ.24.20 కోట్లు

- ఉమ్మడి జిల్లాకు రూ.85 కోట్లు
- 4.26 లక్షల మంది రైతులకు లబ్ధి

కిసాన్ యోజన... డబ్బులొస్తున్నాయ్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ యోజన పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.85 కోట్లు రానున్నాయి. రైతులకు పెట్టుబడి భరోసా కల్పించటంతో పాటు, ఇతర అవసరాల కోసం కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద ప్రతి ఏటా రూ. ఆరు వేలు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. మూడు వాయిదాలలో ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయటం జరుగుతుంది. 2024-2025 సంవత్సరానికి మూడో వాయిదా సొమ్మును 24వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదగా విడుదల చేయనున్నారు. ఈ పథకం కింద గుంటూరు జిల్లాలో 86 వేల మంది, పల్నాడు జిల్లాలో 1.98 లక్షల మంది, బాపట్ల జిల్లాలో 1.42 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లాకు 17.27 కోట్లు, పల్నాడు జిల్లాకు 39.63 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.28.45 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

లబ్ధిదారుల వడపోత..

వాస్తవానికి పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందే వారి సంఖ్య చాలా ఎక్కువగా వుండేది. 2019లో ప్రారంభం అయిన ఈ పథకంలో కొంత మంది అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నట్లు కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లాయి. పొలం అమ్ముకున్న వ్యక్తులు, మరణించిన వారు, విదేశాల్లో ఉంటున్న వారు, ఆదాయపు పన్ను చెల్లించే వారు ఇలా అనేక రకాలుగా అనర్హులకు పీఎం కిసాన్ అందుతున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ విచారణలో ప్రభుత్వం భావించినట్లే చాలా మంది అనర్హులను గుర్తించారు. ఉదాహరణకు గుంటూరు జిల్లాలో గతంలో 1,21,898 మంది పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందే వాళ్ళు. విచారణ జరిపిన తర్వాత ఆ సంఖ్య 86 వేలకు పరిమితం అయ్యింది. అధికారులు చేపట్టిన విచారణలో 33,889 మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. వారిలో 465 మంది ఎన్నారైలు, 3799 మంది ఒకరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందేవాళ్ళు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన 477 మంది, 2019 నాటికే పొలం అమ్ముకొన్నవాళ్ళు 5866 మంది, స్థిరమైన భూ యాజమాన్య హక్కులు లేకుండా పథకంలో లబ్ధి పొందిన వాళ్ళు 12747 మంది, గుర్తు తెలియని, చిరునామా లేని వ్యక్తులు 7247 మంది, ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు 2325 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించి వారిని తొలగించారు.



తీరనున్న సాగునీటి వెతలు



8

ప్రారంభోత్సవానికి సిద్ధమైన పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ ఎత్తిపోతల పథకం

- ప్రారంభానికి సిద్ధమైన పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకం
- వైసీపీ హయాంలో నిలిపివేత
- పట్టుదలగా నిధులిచ్చి పూర్తి చేయించిన లోకేశ్
- వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- 25,344 ఎకరాలకు సాగునీటి లభ్యత

1937లో ఏర్పాటు చేసిన ఓ హైలెవల్ ఛానల్. అప్పట్లో దీనికి నంబూరు హైలెవల్ ఛానల్‌గా నామకరణం చేశారు. బకింగ్‌హామ్ కాలువ కన్నా హైలెవల్ ఛానల్ ఒకటిన్నర మీటరు ఎత్తులో ఉంది. దీంతో రబీలో కాలువలో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉన్న సమయంలో హైలెవల్ ఛానల్ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందక పైర్లు ఎండిపోతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం 2018లో ఈ సమస్యపై దృష్టి పెట్టింది. సుమారు రూ.14.88 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పనులను చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి సుమారు రూ.9 కోట్లతో దాదాపు 70 శాతం పనులను పూర్తి చేసింది. అయితే 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైసీపీ పథకం పనులు పూర్తిగా నిలిపేసింది. గత ఎన్నికల సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయించారు. మార్చి నెలలో ప్రారంభించనున్న ఈ పథకంతో 25,344 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమరేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్



అమరేశ్వరాలయ స్నానఘాట్ వద్ద మంత్రి సుభాష్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఉదయం సందర్శించారు. శివమాల ధరించిన సుభాష్ తన సహచరులతో కలసి ఆలయాన్ని సందర్శించగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివార్లకు మంత్రి సుభాష్ పేరుమీద పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పరమేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని, పేదలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలని కోరుకున్నట్లు సుభాష్ తెలిపారు.

నేటి నుంచి మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

తాడేపల్లి (ప్రాతూరు కట్ట), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పాన్సర్ విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు విజయవాడ క్లబ్‌లో ఏపీ స్టేట్ మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ చౌదరి, కార్యదర్శి పెరవలి చంద్రశేఖరరావు (చంద్రం) తెలిపారు. పురుషులు, సింగిల్స్ మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్ మహిళల డబుల్స్ మిక్సడ్ డబుల్స్‌లో పోటీలుంటాయన్నారు. 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వారి వరకు అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు రానున్నారని, క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు ఫిబ్రవరి 21 ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. మెయిన్ డ్రా మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి 21 సాయంత్రం 4 గంటలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారన్నారు. చలసాని విజయకుమార్, ఇ.బుచ్చిబాబు, విజయవాడ క్లబ్‌లోని బ్యాడ్మింటన్ క్రీడాకారులు యాజమాన్యం, స్పాన్సర్ షిప్ ప్రతినిధులుగా ఉన్నారని చెప్పారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఓటూ ప్రధానమే..

● రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మన్నవ మోహన కృష్ణ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పోటీలో ఉన్న ప్రత్యర్థి అభ్యర్థి ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిన నాటి ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గురువారం నరసరావుపేట నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు-కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ సంబంధించి కూటమి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు మద్దతుగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఓటూ ప్రధానమే అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 63 నుంచి 64 లక్షల పెన్షన్లు ఇస్తున్నామన్నారు. పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేశామని, వికలాంగులకు రూ.6 వేలు చేశామని, పూర్తి వికలాంగత్వంతో ఇబ్బంది పడుతుంటే రూ.15 వేలు చేశామన్నారు. దాదాపు దేశంలో ఎక్కడా లేనివిధంగా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. హామీ మేరకు గ్యాస్ ఉచితంగా అందజేస్తున్నామని, నరసరావుపేటలో మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభించామని చెప్పారు. వచ్చిన ప్రతి పథకం కూడా ప్రజలకు అందించే దాట్లో కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికను కూడా దీటుగా ఎదుర్కొవాలన్నారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్కసారి అధికారం కోల్పోతే పార్టీ నష్టపోవడమే కాకుండా, కార్యకర్తలు, రాష్ట్రం కూడా ఎంత పెద్దఎత్తున నష్టపోయిందో రాష్ట్ర ప్రజలు అందరికీ తెలుసన్నారు. వ్యవస్థలు అన్నీ దుర్వినియోగం చేశారనీ, ఇవాళ ఒక పని మధ్యలో వదిలేస్తే మళ్లీ కట్టాలంటే రూపాయి ఖర్చు అయ్యేది రూపాయిన్నర ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు డయాఫ్రమ్ వాల్ రూ.400 కోట్లు అయ్యేది గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన మొత్తం డ్యామేజీ అయిందన్నారు. మళ్లీ కట్టాలంటే రూ.వేయి కోట్లు అవుతుందన్నారు. ఇది అంతా ప్రజల సొమ్ము అని, భారంగా మళ్లీ ప్రజల మీదపడుతుందన్నారు. గత ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచారని అన్నారు. ప్రతి ఓటరుతో మాట్లాడాలన్నారు, ప్రతి ఒక్కరి ఓటు ప్రధానమైనదేనని, అలసత్వం ప్రదర్శించకుండా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును గెలిపించాలన్నారు. నియోజవర్గ పరిశీలకుడు మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ సమయం కేవలం ఐదు రోజులే ఉందన్నారు. ఈ ఎన్నికల చాలకీలకమైందని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాదు కాదు చంద్రబాబునాయుడు పోటీ చేస్తున్నారని భావించి కూటిమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఓటర్లకు ఎలా ఓటు వేయాలనే విషయంలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కడియాల రమేష్‌బాబు, గొట్టిపాటి జనార్ధనబాబు, కనుమూరి లక్ష్మి, కదం నాగజ్యోతి, జనసేన వీర మహిళ మిరియాల వెంకట సుబ్బమ్మ, షేక్ మాబు, తదితరులు పాల్గొన్నారు. సభకు గూడూరుశేఖర్ అధ్యక్షత వహించారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ మల్లికార్జునరావు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుకి అలవాటు పడటమే కాక వాటి అమ్మకాలు సాగిస్తున్న ఆరుగురి ముఠా సభ్యులను తెనాలి వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో గంజాయి ముఠా వివరాలను డీఎస్పీ బి.జనార్దనరావు వెల్లడించారు. కొల్లిపర మండలం, వల్లభాపురంకు చెందిన ఆరుమళ్ల సాహిత్‌రెడ్డి (25), రెడ్డిబత్తుల హర్షవర్ధన్‌రెడ్డి (28), పాముల రిషి బాబు (25), తెనాలి రామలింగేశ్వరపేట తోటవారి వీధి-2కు చెందిన యర్రమోతు పవన్ ప్రశాంత్ (20), పట్టణంలోని నాజరుపేట తిరుపతమ్మ తల్లి రోడ్డు ప్రాంత నివాసి పసుపులేటి వెంకటేశ్వరరావు (23), గంగానమ్మపేట గోపాల్‌రెడ్డి వీధికి చెందిన వెలగొందుల రమేష్ (18) కొంతకాలంగా గంజాయి మత్తుకు బానిసలై ఆదాయం కోసం గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి రూ.500, రూ.700లకు అమ్మకాలు సాగిస్తున్నారు. వీరిలో ఆరుమళ్ల సాహిత్‌రెడ్డి గంజాయి కేసులో 2021లో జైలుశిక్ష అనుభవించాడు. ఇతని నాయకత్వంలోని ముఠా సభ్యులు ఒడిశాలోని బీదా గ్రామం నుంచి గంజాయి కొనుగోలు చేసి దానిని ఒంటి మీద దుస్తులలోనే దాచి రైలు మార్గం ద్వారా విజయవాడ చేరుకుంటారు. విజయవాడ నుంచి స్వగ్రామం వల్లభాపురం చేరుకుంటారు. తెనాలి, మంగళగిరి ప్రాంతాలలో ఉన్న కష్టమర్లకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కాల్ చేసి నిర్ణీత ప్రాంతంలో వారికి అందిస్తున్నారు. గురువారం ఉదయం ఈ ముఠా పట్టణంలోని వైకుంఠపురం రైల్వే అండర్‌పాస్ వద్ద ఉన్న సమాచారంతో సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ ముఠా సభ్యుల విచారణలో పట్టణంలోని మరో 10 మంది గంజాయి వినియోగదారులు, మంగళగిరి ప్రాంతంలో మరో 50-60 మంది వినియోగదారులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పోలీసుల నిఘా పెరిగిపోవడంతో వారు ఇన్‌స్టాగ్రామ్, ఇతర సాంకేతిక విధానాల ద్వారా కష్టమర్లకు గంజాయి చేరవేస్తున్నారు. వీరి గంజాయి కష్టమర్లని కూడా గుర్తించామని త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. ముఠాని అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ మల్లికార్జునరావును సిబ్బందిని ఎస్పీ పి.సతీష్‌కుమార్ అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

స్వగ్రామానికి జవాన్ మృతదేహం తరలింపు



వెంకటేష్ పార్థివ దేహాన్ని ర్యాలీగా తీసుకొస్తున్న ఆర్మీ జవాన్లు, మాజీ సైనికులు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీలోని గౌడపాలెం గ్రామానికి చెందిన పరిశా మోహన వెంకటేష్‌కు గన్‌బులెట్ బ్యాక్ ఫైర్ కావటంతో మృతి చెందిన సంఘటన విదితమే. గురువారం సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి వెంకటేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. సికింద్రబాద్‌కు చెందిన బెటాలియన్ ఆధ్వర్యంలో ఎఫ్‌వెంట్ కర్నల్ అంకిత్‌శర్మ ఆధ్వర్యంలో జెసియా సాబ్‌లు ముగ్గురు, జవాన్లు 18మంది, మదర్ యూనిట్‌కు చెందిన ఒక జేసీ, ఒక జవాన్ బృందంతో కలిసి గౌడపాలెంకు పార్థివదేహాన్ని తీసుకొచ్చారు. వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చందోలుగ్రామంతోపాటు చెరుకుపల్లి మండలం కుంచాలవారిపాలెం, రాంభొట్లవారిపాలెం గ్రామాల మీదుగా నగరం మండలం పరిశావారిపాలెం నుంచి పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామం మీదుగా స్వగ్రామమైన గౌడపాలెం వరకు ద్విచక్రవాహనాలతో మాజీ సైనికులు, సైనిక అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అమరహే జవాన్ వెంకటేష్ అంటూ నినాదాలు చేశారు. వెంకటేష్ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సిస్టర్ అనస్థాసియా 101వ జన్మదినోత్సవం



సిస్టర్ అనస్తాసియా

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పెదపరిమి గ్రామ వాసి సిస్టర్ మల్లవరపు అనస్థాసియా శుక్రవారం 101వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఆమె జీవితం ఎంతోమందికి ఆదర్శనీయమని కుటుంబసభ్యులు, గ్రామస్థులు పేర్కొన్నారు. సిస్టర్ అనస్థాసియా అన్నలు పాపయ్య, చిన్నయ్య, శౌరయ్య, అక్కలు పెదచిన్నమ్మ, చినచిన్నమ్మ చెల్లెలు శౌరమ్మ తదితరులు ఉన్నారు. సిస్టర్ అనస్థాసియా ప్రస్తుతం సెయింట్ స్టానిస్లాస్ కాన్వెంట్, బెంగుళూరులో ఉన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పెదపరిమి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జ్ఞానప్రకాష్, గ్రామ పెద్దలు, సిస్టర్ బంధువులు అభినందనలు తెలియజేసారు.

గుంటూరుతో ప్రత్యేక అనుబంధం...

గుంటూరులో ప్రముఖ విద్యాసంస్థగా పేరొందిన సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఎక్కువ కాలం సేవలందించారు. నగరంలోని ఆర్థికంగా వెనుకబడిన అనేక పేదకుటుంబాలను చైతన్యపరచి విద్యపట్ల అవగాహన కల్పించి విద్యార్థులను ప్రోత్సహించారు. సిస్టర్ అనస్తాసియా జేఎంజే సభ్యురాలిగా 75 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా ఆ సంస్థ వారు ప్లాటినం జూబ్లీ వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు.

బస్సు.. బైకు ఢీ: యువకుడు మృతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం కావూరు బస్టాండ్ వద్ద బస్సు, బైక్ ఢీకొనటంతో ఒకరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం వేరే వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ వస్తున్న బస్సు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొందని చెప్పారు. పెదమట్లపూడి గ్రామానికి చెందిన ఎ.దుర్గాప్రసాద్(25) మిషపనారు నిమిత్తం బాపట్ల వెళ్లి వస్తుండగా కావూరు బస్టాండ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తిని తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, కావూరు వీఆర్‌వో వివరాలు నమోదు చేశారు. మృతుడి బావ శివకృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని పోలీసులకు వివరాలు ఇచ్చారు.

డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలి

● కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు



నార్కోటిక్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబందిత శాఖలు సమన్వయంతో నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ కమిటీ(ఎన్‌సీవోఆర్‌డీ) జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణకు అంతర్గతంగా ప్రత్యేకంగా కమిటీలను 15 రోజుల్లో ఏర్పాటు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కమిటీలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ స్కూల్స్, కళాశాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు అమ్మకాలు, వినియోగం సమాచారాన్ని తెలిపేందుకు 14405 టోల్ ఫ్రీ నంబరు గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాలు రవాణను రవాణ జరగకుండా రవాణ శాఖ అధికారలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ సతీష్ కుమర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగించటానికి అనువుగా ఉన్న జనసంచారం లేని ప్రాంతాలను మండలాల వారీగా గుర్తించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచి పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు వినియోగిస్తు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో-ఆరినేటర్ విజయ్ ప్రకాష్, ఆచార్య నాగర్జున యూనివర్సిటీ ఓఎస్డీ రవికుమార్, ఎస్ఆర్ఎం ఏపీ యూనిర్సిటీ స్టూడెంట్ ఎఫైర్స్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణన్, అమృత యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటర్ (ల్యాబరేటరీ) హర్షవర్ధన్, వీఐటీ యూనివర్సిటి ప్రొఫెసర్ జగదీష్, జీజీహెచ్ డ్రగ్ ఎడిక్షన్ సెంటరు ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు చెరుకుపల్లి మండలం ఆరుంబాకలో గల భువనశ్రీ ఫర్టిలైజర్స్, గుప్తా ట్రేడర్స్ ఎరువులు పురుగు మందుల దుకాణాలపై జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ డి.సూర్యశ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారులు, మండల వ్యవసాయ అధికారి సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పెద్ద ఎత్తున ఎరువుల స్టాక్ వ్యత్యాసాలను గుర్తించారు. కాలపరిమితి దాటిపోయిన పురుగుమందులను సీజ్ చేశారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా అమ్మకాలు జరపకుండా నిలుపుదల చేసిన సదరు షాపులపై చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిందిగా మండల వ్యవసాయాధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ దాడులలో మొత్తంగా రూ. 15,68,712 విలువ గల స్టాక్ వ్యత్యాసానికి రెండు 6ఏ కేసులు నమోదు చేశారు. సరైన అనుమతుల్లేని బయోపురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కాలపరిమితి దాటిన రూ. 1,13,650 విలువల పురుగు మందులను సీజ్ చేశారు. ఈ దాడులలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన వ్యవసాయాధికారి సీహెచ్ ఆదినారాయణ, సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ వారి సిబ్బంది మండల వ్యవసాయ అధికారి ఎమహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటకాల్వలో అనుమానాస్పదంగా మృతదేహం



ఇన్నయ్య (ఫైల్)

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లపాడు శివారు తురకపాలెం డొంకరోడ్డులోని పంటకాల్వలో అనుమానాస్పదంగా పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు గురువారం పోలీసులకు తెలియజేశారు. మృతి చెందిన వ్యక్తి తురకపాలెం గ్రామానికి చెందిన మక్కెన ఇన్నయ్య(45)గా గుర్తించారు. మృతుడు బుధవారం రాత్రి 9 గంటల వరకూ గ్రామంలోనే ఉన్నాడని మృతుని భార్య లక్ష్మీపార్వతి పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఇన్నయ్య మద్యం తాగి కుటుంబ సభ్యులపై గొడవ పడుతుంటాడని, బుధవారం కూడా గొడవపడి బయటకు వెళ్లాడని తెలిపారు. అనంతరం అనుమానాస్పదంగా మృతదేహం పంటకాల్వలో కన్పించింది. మృతుని ముఖం, తలపై గాయాలున్నాయి. సంఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లక్ష్మీపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చమళ్ళమూడిలో కౌలు రైతు ఆత్మహత్య



మౌలాలి(ఫైల్)

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమళ్ళమూడి గ్రామానికి చెందిన కౌలు రైతు షేక్ మౌలాలి(50)కి అప్పులు పెరగటంతో, తీర్చే దారిలేక బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి భార్య మస్తాన్‌బీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు మౌలాలి గత కొన్ని సంవత్సరాలుగా రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా మిర్చి సాగు తెగుళ్లతో దిగుబడులు రాకపోవటం, వచ్చినా ధర లేక పోవటంతో అప్పుల భారం పెరిగింది. దాదాపు రూ. 6 లక్షలమేర అప్పులు అయ్యాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగా గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య మస్తాన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 535.30 అడుగులు ఉంది. ఇది 178.67 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9160 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 18,480, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్‌ఎల్‌సీ ద్వారా 320 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 37,521 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 23,465 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

1,37,523 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,29,446 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,37,523 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 67,713 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13800	334	11000	11000
నెంబరు. 5	10000	14000	నెంబరు.5	--	--
273	10000	13000	273	--	--
341	10000	14000	341	--	--
4884	10000	12300	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10500	14000	తేజ	--	--
బ్యాడిగి	10000	13500	బ్యాడిగి	11000	11000
దేవనూరు డీలక్స్	10000	13300	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4500	7500	తెల్లకాయలు	4500	6500

డ్రోన్‌ల వాడకం మరింతగా పెంచాలి

● వీడియోకాన్ఫరెన్స్‌లో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్‌ల వాడకం మరింతగా పెంచాలని మహిళా సంరక్షణమీద ఎక్కువ దృష్టిసారించాలని, రోడ్డుప్రమాదాలను తగ్గించేవిధంగా ముందడుగు వేయాలని వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. శాంతిభద్రతలు అమలు పర్చటలో నూతన ఆవిష్కరణ గురించి త్వరలో జరగనున్న శివరాత్రి ఉత్సవం గురించి మహిళలకు ఏవిధంగా భద్రత పెంచాలనే విషయాలు గురించి రోడ్ల యాక్సిడెంట్‌లను ఏవిధంగా తగ్గించాలి అనే విషయం గురించి పెండింగ్ కేసులను పరిష్కరించే విషయాలు గురించి చర్చించినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ జిల్లాపోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేటట్లు చూసి తద్వారా కక్షిదారులకు న్యాయం చేయాలని రోడ్డు ప్రమాదాలు తరుచు జరుగుతున్న ప్రదేశాలను గురించి అక్కడ సీసీకెమెరాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్‌లను విరివిగా వాడుతూ పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ ప్రాంతాలలో వాటి సేవలు ఉపయోగించుకోవాలన్నారు. మహిళలు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాలలోను, గరల్స్‌హాస్టల్ ప్రాంతాలలోను ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేపించి దానిని కమాండ్ కంట్రోరల్‌కు అనుసందానం చేయాలన్నారు. రానున్న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పటిష్ఠమైన బందోబస్తూ ఏర్పాటు చేయాలని సూచించారు.

23న వైద్యశిబిరం

కొల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు దివి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెసర్లంక గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వైద్యశిబిరం నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వైద్యశాల వారు కోరారు.

రీసర్వేలో రైతుల సంతకాలు తప్పనిసరి



సీసీఎల్ డీడీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సర్వేయర్లు, తహసీల్దార్

వేమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లు సంబంధించిన భూయజమాని నుంచి సర్వేకు ముందు, సర్వే అయిన తరువాత సంతకాలు తప్పనిసరిగా తీసకోవాలని సీసీఎల్ డీడీ పేర్కొన్నారు. గురువారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వేమూరు మండల పరిధికి సంబంధించిన భూరీసర్వే టీం సభ్యులు తహసీల్దార్ సుశీల, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని వరహాపురం గ్రామాన్ని గుర్తించి ఆ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే సమాచారాన్ని డీడీ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని సూచనలు చేస్తూ ఫేజ్-1, 2లో నిర్వహిస్తున్న సర్వే ద్వారా ఆ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భూములు నీటి పారుదల శాఖలకు సంబంధించిన భూములను గుర్తించి రికార్డులలో వాటి వివరాలను పొందుపరచాలన్నారు. కోర్టు విచారణలో ఉన్న భూములు సర్వేని జరపవద్దని వాటి విచారణ పూర్తయిన తరువాత సర్వే నిర్వహించాలని సూచించారు ఫేజ్-2 సర్వే పూర్తి కాగానే ఆర్డీవోల సూచనల మేరకు ఫేజ్-3 సర్వేను ప్రారంభించాల్సి ఉంటుందని అన్నారు.

ఆలపాటికి ఓటు వేసి గెలిపించాలి



పెనుమర్రు సచివాలయంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

వేమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కోరుతూ మండలంలోని పెనుమర్రు గ్రామంలో గురువారం టీడీపీ సీనియర్ నాయకులు పార్టీ యూనిట్ ఇన్‌చార్జి మన్నె వేణుగోపాలకృష్ణ (పసి) ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలుసుకుని అనంతరం సచివాలయం సిబ్బందిని ఆలపాటికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట మరికొందరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బషీర్‌బాబావారి గంధ మహోత్సవం



బషీర్‌బాబా వారి జెండాను ఊరేగిస్తున్న భక్తులు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం కూడలినందు గల బషీర్‌బాబా గంధ మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం బాబావారి శిష్యబృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత భవనంవారిపాలెం గ్రామంలోని కొత్తరెడ్డిపాలెం, చందోలు గ్రామపంచాయతీలోని రెడ్డిపాలెంలో అత్యంత వైభోపేతంగా బాబావారి జెండాను ఊరేగించారు. బషీర్‌బాబా వారి దర్గా వద్ద పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. బాబావారి శిష్యబృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు ఏవి?

● బైక్‌స్టాండ్‌గా మారిన మెయిన్ సెంటర్
● రోడ్లపైనే వ్యాపారాలు, ఆటోలు
● పట్టించుకోని అధికారులు



బైక్ స్టాండ్‌గా మారిన వేమూరు బస్టాండ్ సెంటర్



మెయిన్ సెంటర్‌లో అడ్డదిడ్డంగా పెట్టిన ఆటోలు

వేమూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేమూరు మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం తీవ్రంగా ఏర్పడుతోంది. దీనిపై అధికారులు నియంత్రించే విధానంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల వాహన చోదకులకు పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రైల్వే గేటు నుంచి వినాయకుడి గుడి వరకు మెయిన్ సెంటర్‌గా గుర్తింపు ఉంది. ఈ మధ్య రోడ్డు ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు డివైడర్ ఏర్పాటు చేసి విశాలంగా రోడ్డును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతూనే ఉంది. కొందరు వ్యాపారులు రోడ్డున ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆటో వాలాలు, ద్విచక్ర వాహనదారులు రోడ్డును ఏకంగా బైక్ స్టాండ్ లాగా వాడుకుంటున్నారు. రోడ్డుకు రెండు వైపులా అడ్డదిట్టంగా ఆటోలు ద్విచక్ర వాహనాలు ఉంచడం వల్ల ఎటు చూసినా రోడ్డు వాహనాలకే సరిపోతోంది. ఆటో లను కూడా రెండు మూడు వరసలుగా నిలిపి ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. సమీపంలో రైల్వే గేటు ఉంది. రాళ్లు వెళ్లిపోయాక గేటు తీసిన తర్వాత ఒకసారిగా వచ్చే వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం కలగడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో అయితే వాహనాల పార్కింగ్ విపరీతంగా పెరిగి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పోలీసులు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో వాహనాల నిలుపుదలను నియంత్రించడంతో పాటు ఆక్రమణలను తొలగించి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి చెరువులు నింపాలి

● వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి చెరువులన్నిటిని యుద్ధప్రాతిపదికన నింపాలని, సాగునీటికి వారాబందీ విధానాన్ని అమలుచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వివిధశాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత 11శాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైలం డ్యామ్‌లో నీటి నిల్వలు తగ్గముఖం పట్టటంతో బాపట్లజిల్లాకు నీటి విడుదల మార్చి15వ తేదీ నాటికి నిలిచిపోతుందన్నారు. మరో విడతగా ఏప్రిల్ మాసంలో నీరు వస్తుందన్నారు. కృష్ణాపశ్చిమడెల్టా కింద ఉన్న 78చెరువులు, ఎస్ ఎస్‌పీ పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్ చెరువులన్నింటిని నీటితో నింపాలన్నారు. రానున్న వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటికి పూర్తి స్థాయిలో నీరువిడుదలయ్యే పరిస్థితి లేనందున ఈనెల 28వ తేదీ నుంచి వారాబందీ విధానం అమలు చేయాలన్నారు. తక్షణమే రైతులందరికీ ఈ సమాచారం అందించాలన్నారు.

● సాగునీటి కాల్వల మరమ్మతులకు తాజాగా ఎస్‌డీఎంఎఫ్ కింద 119 పనులకు 10.68 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారు. మరో 12 పనుల కోసం 3.29 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. తక్షణమే పనులు చేపట్టటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అదనపు ధరలతో విక్రయిస్తే అధికారులు తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 46289 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులు జిల్లాకు వచ్చాయని 12,531 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతుల కొరకు అందుబాటులో ఉంచామన్నారు. బయట మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిమకొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదులపై తక్షణమే క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు.

● ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు జరిగితే సహించేదిలేదని కలెక్టర్ చెప్పారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, డ్వామా ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే బాపట్లజిల్లా 16వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకోవటంపై అభినందించారు. సాగుకాల్వల మరమ్మత్తు పనులకు ఉపాధిహామీ పనులు అనుసందానం చేయాలన్నారు. పల్లెపండుగ పనులు జాప్యం చేయరాదన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీవో శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ,జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్‌లను, ఎస్పీలను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, పీ4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, వాట్సప్ గవర్నెన్స్ తదితర కార్యక్రమాలపై కలెక్టర్‌కు, ఎస్పీలతో కాన్ఫరెన్స్ నిర్వహించగా బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మార్చి ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రాష్ట్రంలో మార్చి 18వ తేదీ ఉగాది నాటికి పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఐవీఆర్ఎస్ ద్వారా, క్యూఆర్ కోడ్‌ల ద్వారా ప్రజలు నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవటానికి చర్యలు తీసుకోవాలని తెలిపారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సప్ గవర్నమెంట్ ద్వారా అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలు పొందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల సర్వేను మార్చి25 నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఇంటర్మీడియట్ బోర్డు అధికారి పి.యర్రయ్య,జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికై నిరంతరం కృషి చేస్తా

● ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థిలక్ష్మణరావు

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలిలో ప్రజల సమస్యల పరిష్కారానికై నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం బాపట్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2007 నుంచి ఇప్పటి వరకు 14 సంవత్సరాలు ఎమ్మెల్సీగా ఉండి సమాజంలో ముఖ్యంగా కృష్ణా - గుంటూరు జిల్లాలకు సంబంధించిన ప్రజల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించానన్నారు. నిరుద్యోగులకు సంబంధించిన జాబ్‌క్యాలెండర్, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని పోరాటం చేశానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేశారన్నారు. 16,347 పోస్టుల నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. గ్రూప్-1, 2 నోటిఫికేషన్‌లు కూడా విడుదల చేయాలన్నారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, వీరికి బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా ప్రజల సమస్యలపై పోరాడుతానని ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓటు తనకు వేయాలని కోరారు.

ఫుడ్‌సేఫ్టీ ట్రైనింగ్ జిల్లా బ్రాంచ్ ప్రారంభోత్సవం



విజయలక్ష్మీపురంలో ఫుడ్‌సేఫ్టీ ట్రైనింగ్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గరికపాటి ప్రభాకరరావు

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలో విజయలక్ష్మీపురం నందు ఫుడ్‌సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ జిల్లా బ్రాంచ్ కార్యాలయాన్ని గురువారం జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గరికపాటి ప్రభాకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం రూపొందించిందని జిల్లాలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కిరణా దుకాణాలు, మాంసం విక్రయ దుకాణాలు, స్వీట్ షాపులవారు శిక్షణ తీసుకొని సర్టిఫికేషన్ పొందాలని తెలిపారు. జిల్లా అధికారి దేవరాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఫుడ్ మేకర్ శిక్షణ తీసుకోవాలని కోరారు. ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత మాట్లాడుతూ ఎఫ్‌వోఎస్‌టీఏసీ శిక్షణ పొందటం వల్ల ఆహార సంబంధిత వ్యాధుల నుంచి మనుషులను కాపాడుకుంటూ కల్తీ ఆహారాన్ని గుర్తించటం, శుభ్రత, పరిశుభ్రత నైపుణ్యాన్ని తెలుసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్‌సేఫ్టీ ట్రైనర్ కె.ప్రవీణ్‌కుమార్, బాపట్ల బ్రాంచ్ మేనేజర్ నవీన్, కిరణా అసోసియేషన్ సెక్రటరి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ప్రతిరోజు శుభ్రపర్చాలి : మున్సిపల్ కమిషనర్

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రోడ్లను ప్రతిరోజు శుభ్ర పర్చాలని పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి సూచనలు చేశారు. గురువారం తెల్లవారుజామున పారిశుధ్య కార్మికుల హాజరు పట్టీని ఆయన తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులతో నేరుగా మాట్లాడుతూ గృహ యజమానుల నుంచి సేకరించే చెత్తను తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలుగా వేరు చేసిన తర్వాత మాత్రమే తీసుకోవాలన్నారు. డ్రైనేజీ పూడికతీత పనులు చేయాలన్నారు. అదేవిధంగా నీటి సరఫరా విషయమై పటేల్‌నగర్ ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తుఫాన్‌నగర్, మహాలక్ష్మీ చెట్టు ప్రాంతాలను ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించి నీటి సరఫరా విషయమై పలు సూచనలు చేశారు. అనంతరం సూర్యలంక రోడ్డులోని అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహారాన్ని తిని రుచి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ క్యాంటీన్ పరిసరాలు ఎప్పుడు శుభ్రంగా ఉండాలని సూచించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల శిక్షణ

కొల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 120 రోజులు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఉన్నత పాఠశాలలో కొనసాగుతుంది. గురువారం కొల్లూరులోని జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు కొల్లూరు, భట్టిప్రోలు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, దేవరాజులు పాల్గొని ఐదు విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఆయా అంశాల వికాసాల అభివృద్ధికి కృత్యాలతో కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎంలు, అరుణ, చిదంబరం, రిసోర్స్ పర్సన్స్ సుధాకర్, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, మాణిక్యం, సునీత, ఉపాధ్యాయులు సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

కరాటే శిక్షణతో శారీరక దృఢత్వం

● డీఈవో ఎస్ పురుషోత్తం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాలికలు కరాటే శిక్షణ ద్వారా మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ పురుషోత్తం అన్నారు. గురువారం రాష్ట్ర సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా బాపట్ల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో స్వీయపరిరక్షణ సెల్ఫ్‌డిఫెన్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 9 తరగతులు చదువుతున్న బాలికలు ఏవిధంగా వారిని వారు సంరక్షించుకోవాలి అనే అంశంతో కరాటే శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో జీసీడీవో చారులత మాట్లాడుతూ ఆత్మరక్షణ సాహసానికి తొలిమెట్టు అని పేర్కొన్నారు. ఈ శిక్షణ 20 రోజులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ రాము, ట్రైనర్స్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు, సమగ్రశిక్ష ఏఎంవో మోజెస్, ఐఈడీ జోత్స్న, సీఎంవో శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నదానం ఏర్పాట్లపై కమిటీ

అమృతలూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గోవాడ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే ఆర్యవైశ్యులకు శ్రీబాలకోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య రంగనాయకుల శ్రేష్టి అన్నదానం సత్రంలో అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు గురువారం తెలిపారు. దీనికోసం అన్నదాన సత్రంలో సత్ర కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి గుంటూరు కృష్ణా, ప్రకాశం, జిల్లాల నుంచి ఎంతో మంది ఆర్యవైశ్యులు తరలిరానున్నారు. ఈ ఏడాది 10 వేల మంది భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని జిల్లాల ఆర్యవైశ్యులు తరలిరావాలని కోరారు. సమావేశంలో శికాకొల్లి తాండవకృష్ణ, ఉపాధ్యక్షులు తమ్మనసాంబశివరావు, కొత్తమాసు వెంకటరమణకుమార్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, కపలవాయి శ్రీనివాసరావు, శ్రీకాకుళం సుధాకర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ తల్లి గ్రామోత్సవం

చుండూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చుండూరు గ్రామదేవత నాంచారమ్మ గ్రామోత్సవాన్ని గురువారం గ్రామంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కోలాట భజనల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. వాసుదేవ్‌దీక్షిత్ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు



ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను ఆలపాటికి ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రచారం నిర్వహించారు. గురువారం భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, పెదపులివర్రు, పల్లెకోన, సూరేపల్లి, ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ నెల 27వ తేదీన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేస్తున్నారని, ఉపాధ్యాయులంతా ఆయనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా పాఠశాలల్లో జ్ఞానజ్యోతి శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఎల్‌వోసీ అందజేత

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఎల్‌వోసీ అందజేశారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామానికి చెందిన సలగల బసవమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించారు. శస్త్ర చికిత్సకు అవసరమైన వైద్య ఖర్చులు అందించాలని కోరడంతో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి రూ.2,04,379లు మంజూరు చేసి ఎల్‌వోసీ రూపంలో అందించారు. ఎమ్మెల్యే గురువారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మహిళ కుటుంబసభ్యులకు అందజేశారు. వారు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ముప్పలనేని



మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముప్పలనేని శ్రీనివాసరావు, శేషు సుమంత్

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, అతడి కుమారుడు పారిశ్రామికవేత్త ముప్పలనేని శేషు సుమంత్ గురువారం రాజధాని అమరావతిలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా వ్యక్తిగతంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది ఉద్యోగాల కల్పన, విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలే ధ్యేయంగా వారు చేస్తున్న కృషిని అభినందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

సీఎం చంద్రబాబుతోనే గిరిజనుల అభ్యున్నతి

● తిరువీధుల శంకరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న యానాది హక్కుల పోరాటసమితి అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్, టీడీపీ నాయకులు

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభ్యున్నతి, గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు, యానాది హక్కుల పోరాటసమితి అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్ అన్నారు. గురువారం టీడీపీ స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులను గుర్తించిన పార్టీ టీడీపీ అని గతంలో గిరిజనులకు టీటీసీ, బీఈడీ లేకుండా ఎస్టీలకు ముందు టీచర్ పోస్టులిచ్చి తర్వాత ట్రైనింగ్ ఇచ్చిన పార్టీ టీడీపీ అని అన్నారు. ఆర్టీసీలో కూడా లేడి కండెక్టర్ పోస్టులు కూడా ఇచ్చినది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు కూడా బాపట్లజిల్లా స్టూవర్టుపురం గ్రామం నుంచి ఓ గిరిజన మహిళ తొలిసారి ఓ యూనివర్సిటీకి వీసీగా వెళ్లారని ఆమె పేరు సాతుపాటి ప్రసన్నశ్రీ అని అన్నారు. రాష్ట్రంలో వీసీగా నియమితురాలైన తొలి ఎరుకలి సామాజికవర్గ మహిళ ఆమే కావటం విశేషమని తెలిపారు.

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలి



ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా ప్రచారం చేస్తున్న చేనేత నాయకులు

రేపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాని భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు అన్నారు. గురువారం కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా గెలిపించాలంటూ 9వవార్డు నుండి 12వార్డు వరకు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాతంలో అభివృద్ధికి కృషిచేసిన ఆలపాటి రాజా అందరికి సుపరిచితులేనన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడ్డారన్నారు. విద్యావంతుడైనటువంటి వ్యక్తిని గెలిపించుకుంటే భవిష్యత్తు తరాల వారికి అండగా నిలుస్తారని అన్నా రు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి నాగరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, అగస్త్య, ప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఇంటింటికి ప్రచారం

● తెలుగుమహిళ అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి గెలపించాలని తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి గురువారం సంగుపాలెంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల ప్రకారం ఆమె కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించి పట్టభద్రులకు పార్టీ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కడియాల ప్రసాద్, వెంకటస్వామి, దానయ్య, శ్రీను, పట్టభద్రులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అండగా సంగం డెయిరీ



పాడిరైతులకు చెక్కును అందజేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్

నగరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులకు కష్టకాలంలో సంగం డెయిరీ అండగా నిలుస్తుందని డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్ అన్నారు. గురువారం ధూళిపూడి గ్రామంలో పాల ఉత్పత్తిదారుడి పాడి గేదె చనిపోవటంతో టీవీఎస్ పశుసంక్షేమ పథకం ద్వారా రూ.50వేలు చెక్కును బాధితురాలికి అంద జేశారు. మెట్టగౌడపాలెం గ్రామానికి చెందిన ఓ రైతుకు అభయ్ ప్రొడ్యూసర్ ఇన్సూరెన్స్ ద్వారా మరో రూ.50వేలు అందజేశారు. కోఫూరివారిపాలెంలో పాడిరైతుకు రూ.50వేలు చెక్కును అందజేశారు. అంతేకాకుండా పలు పాలకేంద్రాల్లో వైద్యశిబిరాన్ని సంగం డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఏరియా మేనేజర్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు అద్దంకి నవీన్ గౌడ్, వెటర్నరీ వైద్యులు ప్రసాద్, బాలకృష్ణ, గోపీ, వేతన కార్యదర్శి కోటిలింగం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీరనాయకునిపాలెంలో క్వారీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా తదితరులు

అక్రమ తవ్వకాలపై విచారణ

- ఎన్జీటీ ఆదేశాలతో గ్రావెల్ క్వారీలను పరిశీలించిన అధికారుల బృందం
- సమగ్ర సర్వేకు సబ్‌కలెక్టర్ ఆదేశం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమగ్ర సర్వే ప్రారంభించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా అధికారుల బృందంతో అక్రమంగా మైనింగ్ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. చేబ్రోలు మండలం, వీరనాయకునిపాలెంలో జరిగిన అక్రమ తవ్వకాలను పరిశీలించారు.పూర్తిగా సర్వేచేసి ఎంత లోతు గ్రావెల్‌తవ్వకాలు సాగించారో, ఎన్ని క్యూబిక్‌మీటర్‌ల మట్టి అక్రమంగా తరలించారో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే క్వారీగుంతల్లో నీరు చేరడంతో లోతు ఎలా కొలుస్తారని సబ్ కలెక్టర్ ప్రశ్నించడంతో నీటి లోపల లోతును కూడా కొలిచే లేజర్ సాంకేతిక యంత్రాలు ఉన్నాయని అధికారులు వివరించారు. తక్షణమే ఆ యంత్రాలను తెప్పించి లోతు కొలవాలని ఆదేశించారు. అధికారుల పరిశీలన జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలను వ్యతిరేకించిన గుమ్మ డి ప్రకాశరావు అనే రైతు సబ్‌కలెక్టర్ వద్దకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

అసైన్డ్ భూముల్లోనూ..

వీరనాయకునిపాలెం గ్రామంలో 1993లో 60 ఎకరాల డీకే పట్టాల భూములను ప్రభుత్వం దళిత రైతులకు పంటల సాగు చేసుకుని జీవనోపాధి పొందేందుకు అందించినట్లు గుమ్మడి ప్రకాశరావు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు ఈ అసైన్డ్ భూముల్లో వైసీపీ మద్దతు దారులు అక్రమంగా ప్రవేశించి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు సాగించినట్లు ఆరోపించారు. పంటభూముల ధ్వంసంపై దళిత రైతులు ప్రశ్నిస్తే పోలీసులను అడ్డం పెట్టుకుని బెదిరించి, దౌర్జన్యం చేసి గ్రావెల్ కొల్లగొట్టినట్లు ఆరోపించారు. దళితులను గుర్తుపెట్టుకుని అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసినట్లు ప్రకాశరావు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ శుక్రవారం తమ కార్యాలయంలో కలిసి వివరాలు అందజేయాలని ప్రకాశరావుకు సూచించారు.

అడుగడుగునా పర్యావరణ ఉల్లంఘనలు

చేబ్రోలు మండలంలో మైనింగ్ పేరుతో అడుగడుగునా పర్యావరణ చట్టాలను ఉల్లంఘించారని జాతీయ హరిత ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించిన వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ ఆరోపించారు. తన వద్ద ఉన్న ఆధారాలను సబ్‌కలెక్టర్‌కు ఆయన అందజేశారు. వైసీపీ పాలకులు కొంతమంది అధికారుల అండదండలతో వీరనాయకునిపాలెం శేకూరు, శలపాడు, వడ్లమూడి, సుద్దపల్లి గ్రామాలలో వందల ఎకరాలలో అక్రమ మైనింగ్ చేసినట్లు మైనింగ్ వివరాలను అందజేశారు. అక్రమ మైనింగ్‌తో 700 ఎకరాలలో ఉద్యాన పంటలు కనుమరుగు అయినట్లు ఆరోపించారు. తాత్కాలిక అనుమతులు పొంది అనుమతి గడువు ముగిసిన తరువాత కూడా యథేచ్ఛగా 70 మీటర్లుకు పైగా మైనింగ్ సాగించినట్లు ఆధారాలను అందజేశారు. గతంలో విచారణ చేసిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టకపోవడంతో న్యాయం జరగలేదనీ, ప్రస్తుత విచారణను సమగ్రంగా చేయాలని శివలింగ ప్రసాద్ అధికారులను కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సిన్హా రైతులతో మాట్లాడుతూ సమగ్ర సర్వే నిర్వహించి తవ్వకాల నివేదికను ఉన్నతాధికారుల ద్వారా నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే ఉమ్మడి గుంటూరు - కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను భద్రపరచడానికి స్థానిక ఏసీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. ఏసీ కళాశాలలో మొత్తం 4 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటుచేయగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎటువంటి బందోబస్తు ఏర్పాటుచేయాలి, ఎంతమంది పోలీస్ సిబ్బందిని కేటాయించాలి, స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వెళ్లడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి, బ్యాలెట్ బ్యాక్సులను తీసుకొచ్చి - తీసుకెళ్లే సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎటువంటి భద్రత చర్యలు తీసుకోవాలి అనే వివిధ అంశాలకు సంబంధించి చర్చించి జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, హనుమంతు, డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు గణేష్, వెంకటేశ్వర్లు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోసెస్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తీరనున్న సాగునీటి వెతలు

- ప్రారంభానికి సిద్ధమైన పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకం
- వైసీపీ హయాంలో నిలిపివేత
- పట్టుదలగా నిధులిచ్చి పూర్తి చేయించిన లోకేశ్
- వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- 25,344 ఎకరాలకు సాగునీటి లభ్యత

ఎన్నికలైపోయాయి... గెలిచేశాం కదా.. మళ్లీ ఎన్నికలొచ్చే వరకు చాలా టైముందని అనుకోకుండా... గెలిచిన మర్నాటి నుంచే నియోజకవర్గ ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చేపనిలో పడ్డారు మంగళగిరి ఎమ్మెల్యే నా రా లోకేశ్. గత ఎన్నికల్లో మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలుపైనా ఆయన ప్రత్యేక దృష్టి పెట్టా రు. హామీ చిన్నదైనా.. పెద్దదైనా సరే.. గుర్తుంచుకొని మరీ వాటిని చకచకా అమలు చేసేస్తున్నారు. ఎన్నికల హామీల అమలు కావొచ్చు.. మంగళగిరి ప్రాంత అభివృద్ధిపై లోకేశ్‌కున్న పట్టుదల కావొచ్చు.. మంగళగిరికి మాత్రం ఇంతకుముందెన్నడూ కనీవిని ఎరుగనిరీతిలో అతిపెద్ద ప్రాజెక్టులు వరాల మాదిరి వచ్చిపడుతున్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గ రైతాంగం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పెదవడ్లపూడి హైలెవల్ చానల్ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి రెడీ అయిపోయింది. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును లోకేశ్ పూర్తి చేయించారు. ఈ పథకం వలన మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలలోని సుమారు 25,344 ఎకరాలకు సాగునీరందబోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లోకేశ్ ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించి రైతన్నలకు కానుకగా అందిస్తున్నారు.

మంగళగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణాడెల్టాలోని సుమారు 26 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే లక్ష్యంతో పెదవడ్లపూడి వద్ద బకింగ్‌హామ్ కాలువ నుంచి పశ్చిమంగా లాకులతో కూడిన ఓ హైలెవల్ ఛానల్‌ను 1937లో ఏర్పాటు చేశా రు. దీనికి అప్పట్లో నంబూరు హైలెవల్ ఛానల్‌గా నా మకరణం చేశారు. ఈ ఛానల్ ద్వారా మంగళగిరి, తె నాలి, పొన్నూరు నియోజకవర్గాలలోని 26 వేల ఎకరాలకు సాగునీటిని అందించే ప్రయత్నం చేశారు. అంటే బకింగ్‌హామ్ కాలువ నుంచి హైలెవల్ ఛానల్ లాకులను ఎత్తి ఛానల్‌లోకి నీటిని పంపేవిధంగా దీనిని డిజైన్ చేశారు. అ యితే ఈ ప్రణాళిక కేవల ఖరీఫ్ సీజను వరకు మాత్రమే రైతులకు వినియోగపడుతూ వచ్చింది. రబీలో బకింగ్‌హామ్ కాలువలో నీటి ప్రవాహం బాగా తక్కువగా ఉండడంతో హైలెవల్ ఛానల్ లాకులను పూర్తిగా ఎత్తివేసినప్పటికి ఛానల్‌లోకి నీళ్లు ఎక్కని పరిస్థితులు నెలకొంటున్నాయి. బకింగ్‌హామ్ కాలువ పూర్తి సామర్థ్యం ఎనిమిది వేల క్యూసెక్కులు కాగా అందులో కనీసం సగం అంటే నాలుగువేల క్యూసెక్కుల ప్రవాహం వుంటేతప్ప హైలెవల్ ఛా నల్‌లోనికి నీళ్లు ఎక్కడంలేదు. దీనికికారణం బకింగ్‌హా మ్ కాలువ కన్నా హైలెవల్ ఛానల్ ఒకటిన్నర మీటరు ఎత్తులో ఉండడమే. దీంతో ఖరీఫ్ సీజనులో బకింగ్‌హా మ్ కాలువ పూర్తి నీటి సామర్థ్యంతో పరవళ్లు తొక్కు తూ ఉంటున్న కారణంగా హైలెవల్ ఛానల్‌లోకి నీళ్లు వెళ్లగలుగుతున్నాయి. రబీలో బకింగ్‌హామ్ కాలువలో నీటి ప్రవాహం చాలాతక్కువగా ఉండడంతో హైలెవల్ ఛానల్ కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందక పైర్లు ఎండిపోతున్నాయి. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితులపై మూడు నియోజకవర్గాల్లోని రైతులు ఎప్పటినుంచో ఆందోళన చెందుతున్నారు.

యుద్ధప్రాతిపదికన పూర్తి..

హైలెవల్ ఛానల్ ఆయకట్టుకు రబీలో కూడ సాగునీరందించాలంటే బకింగ్‌హామ్ కాలువ నుంచి హైలెవల్ ఛానల్‌లోకి నీళ్లను ఎత్తిపోయడమే ఏకైక పరిష్కార మార్గమని నిపుణులు ప్రభుత్వానికి సూచిస్తూ వచ్చారు. దశాబ్దాల తరబడి ఈ సమస్య అపరిష్కృతంగా ఉన్నప్పటికీ రాష్ట్ర విభజనానంతరం రాజధాని ఈ ప్రాంతానికే రావడంతో టీడీపీ ప్రభుత్వం 2018లో ఈ సమస్యపై దృష్టిని సారించింది. సుమారు రూ.14.88 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పనులను చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి సుమారు రూ.9కోట్ల విలువైన దాదాపు 70శాతం పనులను పూర్తి చేసింది. అయితే 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైసీపీ పథకం పనులు పూర్తిగా నిలిపేసింది. దీంతో మూడు నియోజకవర్గాలకు చెందిన ఆయకట్టు రైతులకు ఆశాభంగమే ఎదురైంది. 2024 ఎన్నికల సందర్భంగా దుగ్గిరాల మండల ప్రజలు ఈ సమస్యను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ప్రాధాన్యంగా ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే లోకేశ్ గెలిచిన వెంటనే ఎత్తిపోతల పథకానికి సంబంధించి గతంలో కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులను చెల్లించి మిగతా నిధులను కూడ మంజూరు చేయించి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. ఎత్తిపోతల నిర్వహణ కోసం పక్కనే ప్రత్యేకంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కూడ ఏర్పాటు చేయించారు.

ట్రయల్‌రన్‌పై అధికారుల సంతృప్తి


ఇటీవలే ఎత్తిపోతల పథకం పనులు పూర్తయ్యాయి. తాజాగా ఏపీఎస్ఐడీసీ అధికారులు ట్రయల్‌రన్ కూడ నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎత్తిపోతలలో 215 అశ్విక సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లను ఏర్పాటు చేశారు. వీటి సాయంతో బకింగ్‌హామ్ కాలు వ నుంచి నీటిని తోడి జాక్‌వెల్‌లోకి పోస్తారు. దీని నుంచి నీరు హైలెవల్ ఛానల్‌లోకి ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన డెలివరీ పైపుల ద్వారా సరఫరా అవుతాయి. వాస్తవానికి ఖరీఫ్ సీజనులో లాకుల ద్వారా బకింగ్‌హామ్ కాలువ నుంచి నీటిని హైలెవల్ ఛానల్‌లోకి సహజ ప్రవాహం ద్వారా తీసుకుని రబీ సీజనులో మా త్రం ఎత్తిపోతల సాయంతో నీటిని హైలెవల్ ఛానల్‌లోనికి ఎత్తిపోసుకోవచ్చు. తద్వారా 25,344 ఎకరాలకు రబీ సీజనులోకూడ పుష్కలంగా సాగునీరందుతోంది. హైలెవల్ ఛానల్ ఆయకట్టు కింద ఖరీఫ్‌లో వరిని పం డిస్తుండగా, రబీలో మొక్క జొన్న, మినుములను పండిస్తున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తియినందున మార్చి నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలను చేస్తున్నామని ఏపీఎస్ఐడీసీ అధికారులు తెలిపారు. దీంతో రైతులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు.



ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన 215 హెచ్‌పీ సామర్థ్యం గల నాలుగు మోటార్లు



ఎత్తిపోతల కోసం ప్రత్యేకంగా నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్



కష్టాలు తొలగినట్లే..

ఎన్నో ఏళ్లు నీరందక పంటలు ఎండిపోయి బాగా నష్టపోయాం. కౌలుకి తీసుకున్న వాళ్లు కూడా ఇన్నాళ్లు నష్టపోతూ వచ్చారు. ఇక ఈ నష్టాల కష్టాలకు ఎత్తిపోతలతో తెరపడింది.

\- కొరిటాల రామయ్య, కంఠంరాజు కొండూరు రైతు



ఎత్తిపోతల పథకం గొప్పవరం

ఎన్నోఏళ్లుగా హైలెవెల్ ఛానల్ ద్వారా తగినంత నీరందక తరచూ ఎండుతున్న పంటలకు, ఎత్తిపోతల పథకం గొప్పవరమని పెనుమూలి నీటిసంఘ అధ్యక్షుడు కొరిటాల భాస్కర్ అన్నారు. వేలాది ఎకరాల పంటలకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు, టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే రైతుల ఆశలు నెరవేర్చడం హర్షణీయమన్నారు.

\- కొరిటాల భాస్కర్

పోలింగ్ సిబ్బందికి సామగ్రిని సక్రమంగా అందించండి

- ఆర్‌వో నాగలక్ష్మి ఆదేశాలు



ఏసీ కళాశాలలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ, డీఆర్‌వో

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరిగే ఎన్నికలకు సంబంధించి 26వ తేదీన పోలింగ్ సిబ్బందికి సామగ్రిని సక్రమంగా అందించాలని రిటర్నింగ్ అధికారి ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక ఏసీ కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే గదులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలిసి పరిశీలించి సూచనలు జారీ చేశారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న అనంతరం సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, తాగునీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించాలని సూచించారు. ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరిచేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద మంచి గాలి, వెలుతురు ఉండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించి ఏసీ కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్‌డీవో కె.శ్రీనివాసరావు, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏడీ పవన్ కుమార్, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు



క్యూలైన్‌ల ఏర్పాట్లుపై కూలీలకు సూచనలిస్తున్న ఈవో అశోక్‌కుమార్

అమృతలూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ఒకటైన గోవాడ శ్రీబాలకోటేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లులో భాగంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆలయంతో పాటు, ఉప ఆలయాలను రంగులతో తుది మెరుగులు దిద్దుతున్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజుల లక్షలసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు కోసం ఐరన్ బారికేట్లును వినియోగించారు. దాదాపు క్యూలైన్‌ల ఏర్పాటు పూర్తైంది. ఆలయ పరిసర ప్రాంతాలను చదును పరిచారు. ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు ఎప్పటికప్పుడు అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నారు. ఉత్సవాల ఏర్పాట్లుపై ఇప్పటికే రెండుసార్లు అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరికి స్వా మి దర్శనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో అశోక్‌కుమార్ తెలిపారు.

ఏడాదిలో హైవే నిర్మాణ పనులు పూర్తి

- ఎన్‌హెచ్ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్



బేబీ ఫీడింగ్ సెంటరును ప్రారంభిస్తున్న ఆర్‌కే సింగ్ తదితరులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 1300 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వాటిని సంవత్సరంలోగా పూర్తి చేస్తామని నేషనల్ హైవే అథారిటీ విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం కాజ టోల్ ప్లాజా వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన రెండు అంబులెన్సులు, బేబీ ఫీడింగ్ సెంటరు, చిన్నపిల్లల పార్కు, టాయిలెట్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన అంబులెన్సులో ప్రథమ చికిత్సతోపాటు అత్యవసర సమయంలో చికిత్స అందించే వెసులుబాటు ఉందన్నారు. రాష్ట్రంలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టబోతున్నట్టు తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో కొన్నిచోట్ల అండర్‌పాస్‌లను ప్రభుత్వం సూచించిందని, రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని చెప్పారు. విజయవాడ పడమర బైపాస్ ఏప్రిల్ చివరినాటికి కొంతమేర పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అమరావతి రాజధానిలో ఓఆర్ఆర్ పనులకు సంబంధించి ఏడు నెలల్లో టెండర్లు పూర్తిచేసి, మరో ఏడాదిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం, ఎంకే నాయక్, కృష్ణ చైతన్య, ప్రసాద్, శ్రీ వేంకటేశ్వర ఫుడ్ బీవరేజస్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

ఆట స్థలాలకు మహర్దశ

- పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాగుపడిన క్రీడా ప్రాంగణాలు
- రాష్ట్రంలో 484 పాఠశాలలకు రూ.24.20 కోట్లు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి పీఎంశ్రీ పథకం దోహదపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియాలో ఉన్నత పాఠశాలల ఆట స్థలాలు బాగుపడుతున్నాయి. రాష్ట్రంలోని 484 పాఠశాలలకు రూ.24.20 కోట్లు కేటాయించారు. తొలివిడత రూ.10.54 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో గ్రౌండ్‌లకు మెరకలు వేయడం, ఆడుకోవడానికి వీలుగా తీర్చిదిద్దే పనులు చేపట్టారు. మూడు క్రీడలకు కోర్టులను పక్కాగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటి వరకు వచ్చిన నిధులను కొంతమేర వినియోగించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలకు అవసరమైన మూడు కోర్టులను పక్కాగా రూపొందించేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు కేటాయించగా, రూ.2 లక్షలు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. దీంతో కొంత అభివృద్ధి పనులను నిర్వహించారు. ఆటస్థలం అంతా అభివృద్ధి చేసి విద్యార్థులు ఆడుకునేలా మూడు కోర్టులను చక్కగా తీర్చిదిద్దనున్నారు. క్రీడా ప్రాంగణంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగిన మెరకవేసి కోర్టులను ఏర్పాటు చేసుకోవాలని సమగ్ర శిక్షా అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. గుంటూరు జిల్లాలో అంగలకుదురు, కొల్లిపర, రేవేంద్రపాడు, తుళ్లూరు, నిడుబ్రోలు, పెదనందిపాడు, ముట్లూరు, నంబూరు, ఓబులునాయుడు పాలెం, రావెల, గణపవరం పాఠశాలలు, బాపట్ల జిల్లాలో అమృతలూరు, ఐలవరం, గుళ్లపల్లి, నిజాంపట్నం, మంతెనవానిపాలెం, పందిళ్లపాలెం, ఈపూరుపాలెం, పెదగంజాం, ఉల్లిపాలెం, కొప్పెరపాడు, యద్దనపూడి, ఏల్చూరు, మేదరమెట్ల, నాగులపాడు పాఠశాలలకు నిధులు మంజూరు చేశారు. రెండో విడత రూ.9.94 కోట్లు కూడా విడుదలైతే ఈ పాఠశాలల క్రీడా ప్రాంగణాలు ఏ కాలమైనా విద్యార్థులు ఆనందంగా ఆడుకోవడానికి అనువుగా రూపుదిద్దుకోనున్నాయి.



ఉప్పలపాడు పక్షుల కేంద్రం కన్జర్వేషన్ రిజర్వుగా నోటిఫై

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న పక్షుల రక్షిత కేంద్రాన్ని వన్యప్రాణి చట్టం -1972 నిబంధనలను అనుసరించి కన్జర్వేషన్ రిజర్వ్‌గా నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. అలానే గుంటూరు జిల్లాలోని వెట్ ల్యాండ్‌లను చట్ట ప్రకారం నోటిఫై చేయాలన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి వెట్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్‌తేజతో కలసి పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా అటవీశాఖ అధికారి హిమశైలజ మాట్లాడుతూ ఉప్పలపాడు పక్షుల కేంద్రం గత 20 సంవత్సరాలుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దన్నారు. దీనికి వన్యప్రాణి చట్టం ప్రకారం-1972 ద్వారా కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అరుదైన పక్షి జాతులను కాపాడుకోవాలని, వెట్‌ల్యాండ్ ఉపయోగాలను వివరించారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సహకారాన్ని అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు అటవీ శాఖ ద్వారా గుర్తించిన 300 వెట్ లాండ్స్‌ను పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ స్టేక్ హోల్డర్ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం కీలకం

- ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఈడీసీ) చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా యూనిట్లు నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి సహకరించాలని ఆయన బ్యాంకర్లను కోరారు. గురువారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎంఎస్ఎంఈడీసీ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. చదువుకున్న యువతీ యువకులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు.

సంచార వాహనాల ద్వారా మెరుగైన పశువైద్య సేవలు

- వెటర్నరీ డైరెక్టర్ దామోదర్‌నాయుడు

అమరావతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచార వాహనాల ద్వారా మెరుగైన పశువైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ కాల పరిమితి ముగియడంతో అర్హత గల ఏజెన్సీల నుంచి ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించామని చెప్పారు. నిబంధనల ప్రకారం కొద్ది రోజుల్లో ఏజెన్సీని ఎంపిక చేస్తామన్నారు. అప్పటి దాకా పశువైద్య సేవలకు అంతరాయం లేకుండా 165 వాహనాల ద్వారా ప్రస్తుత ఏజెన్సీ సేవలు అందిస్తుందని చెప్పారు. అలాగే 1962 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉందని వివరించారు.

మిర్చియార్డులో అమ్మకాలు వేగవంతంగా జరగాలి

- మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో రైతులు తీసుకొచ్చిన మిర్చి ప్రస్తుతం ఏ విధంగా అయితే వేగవంతంగా అమ్మకాలు జరుగుతున్నాయో ఇదే జోరు కొనసాగాలని మార్కెటింగ్ శాఖ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఆయన చుట్టుగుంటలోని మార్కెటింగ్ ఏడీ కార్యాలయంలో ఏఎంసీల సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మిర్చియార్డుకు మార్చి మొదటి వారం నుంచి మిర్చి టిక్కీల రాక మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఆ సందర్భంలోనూ ట్రేడింగ్ వేగంగా జరిగి, ఏ రోజుకు ఆ రోజు సరుకు బయటకుపోయేలా పర్యవేక్షించాలని యార్డు అధికారులను ఆదేశించారు. అలానే మార్కెట్ కమిటీలు లక్ష్యం మేరకు ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏడీ బీ రాజబాబు, మార్కెట్ కమిటీల సెక్రెటరీలు పాల్గొన్నారు.

చర్లపల్లి - దానాపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల కారణంగా చర్లపల్లి - దానాపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21నుంచి 28వ తేదీ వరకు నంబరు 07791 చర్లపల్లి-దానాపూర్, నంబరు 07792 దానాపూర్-చర్లపల్లి రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

నిద్రమత్తులో డ్రైవింగ్.. ట్రాక్టర్ బోల్తా

● యువ రైతు మృతి



వెంకటరావు(ఫైల్)

జరుగుమల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి పంచాయతీలోని అగ్రహారం గ్రామానికి చెందిన యువరైతు తాని కొండ వెంకటరావు(35) బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ట్రాక్టర్ బోల్తాపడి దుర్మరణం పాలయ్యాడు. కామేపల్లిలో వేరే వారికి రోటావేటర్‌తో పనిచేసేందుకు వచ్చి, పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళుతున్నాడు. నిద్రమత్తులో రావులకొల్లు అడ్డరోడ్డు వద్ద ట్రాక్టరు అదుపుతప్పి తిరగబడింది. వెంకటరావు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మరణించాడు. పొగాకు సాగు చేసిన వెంకటరావు, తన సొంత పనులతోపాటు, ఇతరుల పొలాల్లోనూ ట్రాక్టరుతో పని చేస్తుంటాడు. పని ఒత్తిడి, నిద్రలేమి కారణంగానే ట్రాక్టర్ నడుపుతూ నిద్రలోకి జారుకుని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

తిరునాళ్లకు వెళ్లి వస్తుండగా ఘటన

10 తులాల బంగారం అపహరణ

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరునాళ్లకు వెళ్లి బస్సులో తిరిగి వస్తుండగా, పక్కన కూర్చున్న మహిళలే బ్యాగ్‌ను చోరీ చేసిన ఘటన గిద్దలూరులో చోటుచేసుకొంది. దీంతో బ్యాగులోని 10 తులాల బంగారం అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గిద్దలూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన చాబోలు లక్ష్మీదేవి తన కుమారుడు, కోడలితో కలిసి ఈ నెల 18న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని అహోబిలం పుణ్యక్షేత్రంలో జరుగుతున్న తిరునాళ్లకు వెళ్లారు. తిరునాళ్ల ముగిసిన తర్వాత అహోబిలం నుంచి గాజులపల్లె వరకు బస్సులో వచ్చారు. గాజులపల్లె వద్ద గురువారం ఉదయం టిఫిన్ చేసి తరువాత నంద్యాల-విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఎక్కారు. బస్సులో బంగారు కలిగి ఉన్న బ్యాగ్ తన వద్దనే ఉంచుకొని లక్ష్మీదేవి కూర్చొన్నారు. అక్కడే మరో ముగ్గురు మహిళలు కూడా బస్సులో ఎక్కారు. లక్ష్మీదేవి పక్కన ఉన్న ఇరువురు మహిళలు, మరో మహిళ కూడా గిద్దలూరు సమీపంలో దిగువమెట్ట వద్ద బస్సు దిగి వెళ్లారు. బస్సు గిద్దలూరు వచ్చిన తరువాత లక్ష్మీదేవి బ్యాగ్‌ను చూడగా బ్యాగ్ కనిపించలేదు. వెంటనే కొడుకు, కోడలికి విషయం తెలియజేశారు. వారు హుటాహుటిన గిద్దలూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బ్యాగ్ చోరీకి గురైందని, అందులో 10 తులాల నక్లెస్, ల్యాంగ్ చైన్, కడియం ఉన్నాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూపు-2, ఇంటర్మీడియెట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆయా పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ పరీక్షల నిర్వహణపై సమావేశమై మాట్లాడారు.

23న గ్రూపు-2 పరీక్షలు

జిల్లాలో ఈనెల 23న జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. ఈ పరీక్షలకు 4,544 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో 8801188046 సెల్ నెంబర్‌తో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై...

మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 42,439 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా అందుకోసం 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, మరో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలు పనిచేసేలా జిల్లా స్థాయిలో 08592-281275 నెంబర్‌తో కంట్రోలు రూమును ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బాధ్యత రెండు జిల్లాలది..
బాధలు జనాలవి...

సగం ఊరు బాపట్ల.. మిగిలిన సగం ఊరు గుంటూరు జిల్లాలో...

తిక్కరాజుపాలెం గ్రామస్థులను వదలని కష్టాలు

మంచినీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే

భూమి పత్రాల విషయంలోనూ ఇబ్బందులే

పలు ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు

తిక్కరాజుపాలెం(పర్చూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆ ఊరికి రెండు పంచాయతీలు.. ఇద్దరు సర్పంచ్‌లు.. ఇద్దరు ఎంపీపీలు.. ఇద్దరు ఎమ్మెల్యేలు.. ఇంకా చెప్పాలంటే రెండు జిల్లాల పరిధిలో ఉంది. రెండు జిల్లాల పాలకులు కనుసన్నల్లో పాలన నడుస్తున్న గ్రామాన్ని పుట్టెడు కష్టాలు వెంటాడుతున్నాయి. ఏ జిల్లా అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా స్పందిస్తే ఆ ఊరి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎవరూ ఆ గ్రామంపై దృష్టి పెట్టలేదు. ఈ కారణంగా ఆ గ్రామస్థుల తాగునీటి కష్టాలు నేటికీ తీరడం లేదు. కనీస సమస్యలు కూడా పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామం పేరు తిక్కరాజుపాలెం. వివరాల్లోకెళ్తే...

తిక్కరాజుపాలెంలో సుమారు 500 మంది జనాభా ఉంటారు. ఆ ఊరు సగభాగం బాపట్ల జిల్లా పర్చూరు మండలం, మిగిలిన సగభాగం గుంటూరు జిల్లా కాకుమాను మండలంలో ఉంది. పర్చూరు మండలంలోని గొల్లపూడి పంచాయతీలో కొంత భాగం, కాకుమాను మండలంలోని గార్లపాడు పంచాయతీ పరిధిలో కొంత భాగంలో విస్తరించి ఉంది.



తిక్కరాజుపాలెం గ్రామం



రెండు గ్రామాలను వేరుచేసే రోడ్డు ఇదే

ఇక్కడ మరో విశేషం ఏమిటంటే ఈ గ్రామస్థులు కొందరు పర్చూరు, మరికొందరు ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థులకు ఓట్లు వేస్తుంటారు. పన్నుల రూపంలో పెద్దగా ఆదాయం వచ్చేది లేదు. దీని వల్ల అక్కడ చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు పంచాయతీలు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

రైతుల సమస్యలు చెప్పనలవి

తిక్కరాజుపాలెం వాసులకు గ్రామంలో ఇరువైపులా భూములు ఉన్నాయి. ఇవి రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో ప్రభుత్వ పథకాల కోసం ధ్రువీకరణ పత్రాల కోసం ఇతరత్రా భూ సమస్యల పరిష్కారం కోసం రెండు జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామాన్ని ఒకే నియోజకవర్గం, ఒకే గ్రామ పంచాయతీలోకి కలిపి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదిలావుండగా ప్రజా ప్రతినిధులు సైతం ఇరు జిల్లాలకు చెందిన అధికారులను కలుసుకోవాల్సిందే. ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలోనైనా తిక్కరాజుపాలెం గ్రామ కష్టాలను పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా రక్షిత నీటి పథకం

మంచినీటి కోసం బహుదూరం వెళ్లాలి

గ్రామస్థులు తాగునీటి కష్టాలు వర్ణనాతీతం. నీటి కోసం పొరుగు గ్రామాలైన చెరుకూరు, పర్చూరు, చిననందిపాడు గ్రామాలకు సుమారు ఆరేడుకిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, దివ్యాంగులు గత్యంతరం లేక గ్రామంలోని చెరువు నీటితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. కనీసం ఉన్న ఒక్క చెరువు కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

సామాజిక తనిఖీలో రూ.8లక్షల రికవరీ

సోషల్ ఆడిట్‌పై ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం

వైసీపీ పాలనలో రూ.13 కోట్లతో పనులు

పెద్ద ఎత్తున అవినీతి

తూతూమంత్రంగా ఆడిట్



బల్లికురవలో సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు (ఫైల్)

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకానికి సంబంధించి రెండేళ్ల కాలానికి గాను సామాజిక తనిఖీ పూర్తి కాగా అధికారులు కేవలం రూ.8 లక్షలతో చేపట్టిన పనులలో మాత్రమే అవకతవకలు జరిగాయని గుర్తించారు. మొత్తం రూ.13కోట్ల పనులు గత వైసీపీ హయాంలో జర్గ్గా పెద్ద ఎత్తున గ్రామాలలో ఉపాధి పనులలో అవకతవకలు చోటుచేసుకున్నాయి.

అక్రమాలు ఇలా...

కొన్ని గ్రామాలలో రోడ్లు వేయకుండానే, అలానే మొక్కలు లేకుండానే, కొందరు పనులకు వెళ్లకుండా బోగస్ మస్టర్లు వేసి నిధులు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. అంతేగాక కొన్నిచోట్ల ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కూలి సొమ్ము చెల్లించడం, మరి కొన్ని చోట్ల ఉపాధి సిబ్బంది క్షేత్ర సహాయకుల నుంచి బోగస్ మస్టర్లు వేసినందుకు నగదు వసూళ్లు చేయడం, ఎంబుక్‌లు లేకుండానే పనులకు నిధులు మంజూరు చేయడం వంటి అభియోగాలను సామాజిక తనిఖీలో బృందాలు గుర్తించాయి.

ప్రజా వేదిక కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియకుండా రెండు రోజుల కిందట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు. అధికారులు రాకముందే ఉపాధి సిబ్బంది తాము అంతా సెటిల్ చేసుకున్నాం తమకు ఏమీ కాదని బహిరంగంగా ప్రచారం చేశారు. ఆ ప్రచారం వలే సామాజిక తనిఖీలో అధికారులు గత వైసీపీ పాలనలో పనిచేసి ఉద్యోగాలు మాని వేసిన వారికి పెనాల్టీలు విధించి చేతులు దులుపుకున్నారు. మొత్తం రూ.8లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించగా.. అందులో గతంలో పనిచేసిన 18 మంది క్షేత్ర సహాయకులకు రూ.7లక్షల వరకు రికవరీలు వసూళ్లు చేయాలని పెనాల్టీలు వేశారు. ఆడిట్‌కు మాత్రం గతంలో పనిచేసిన క్షేత్ర సహాయకులు గైర్హాజరు కావడం గమనార్హం. వారిని అటువైపు రాకుండా అధికారులే ప్లాన్‌గీసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి సిబ్బందికి రూ.లక్ష వరకు రికవరీలు రాశారు. అధికారులకు తెలియకుండా క్షేత్ర సహాయకులు అవకతవకలకు ఎలా పాల్పడతారని తరచూ తనిఖీలు చేసే అధికారులు పనుల వద్ద ఏం పరిశీలన చేశారని, గతంలో జరిగిన తప్పులకు అధికారుల పాత్ర కూడా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. సామిజిక తనిఖీలపై నమ్మకం పోతుందని వారు అంటున్నారు. ఉపాధి పనులలో లోపాలు గుర్తించేందుకు లక్షలు ఖర్చు చేస్తూ చేస్తున్న ఆడిట్‌లు ఇకముందైనా సక్రమంగా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికతో కూడిన విద్యతోనే నైపుణ్యాభివృద్ధి

● ప్రొఫెసర్ రాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యో తి): ప్రతి విద్యార్థికి ప్రణాళికతో కూడిన విద్యతో నే నైపుణ్య అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ కెరియర్ కౌన్సిలర్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నా రు. భీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన ఓరియంటేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ అంశంపై సదస్సు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరి గింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశలోనే తన భవిష్యత్ కు సంబంధించిన ప్రణాళిక చేసుకోకపోవడం వల్లే డిగ్రీ విద్యార్థులు సరైన నైపుణ్యాలు లేక జీ వితంలో ఉద్యోగ అవకాశాలు పొందలేక పోతున్నారని చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన త ర్వాత ఉన్నత విద్య కోసం జాతీయస్థాయి వి శ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం వల్ల లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ రంగ ఉద్యోగాల కన్నా ప్రైవేటు రంగంలోనే ఎక్కువ అవకాశాలు ఉన్నా యని, ప్రతి విద్యార్థి వినూత్నంగా ఆలోచన చేయాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలం టే విద్యా ఒక్కటే ప్రధాన మార్గమన్నారు. విద్యా ర్థులు చదువు మీదకంటే డ్రగ్స్‌వంటి చెడు అలవాట్లకు లోనవుతున్నారని, దానివల్ల జీవితంలో సరైన లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని తెలిపా రు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ యర్రమాల కోటేశ్వరరావు, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మల్లికార్జున్, భీమ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, అంగలకుర్తి వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్, బీరకాయల మహేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశేఖర్

కొణికి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర

టీడీపీ గెలవడంతో మొక్కుతీర్చుకుంటున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గుది సీతారామయ్య ఆధ్వర్యంలో కొణికి నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రను గురువారం మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. 20024లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో కడిగిన ముత్యంలా బాబు విడుదల కావాలని, పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, ఏలూరి సాంబశివరావు మూడోసారి గెలవాలని మండలంలోని కొణికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గుది సీతారామయ్య శ్రీశైలానికి పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు శివస్వామి దీక్షధారణ చేసి గురువారం కొణికి నుంచి శ్రీశైలంకు పాదయాత్రతో బయలుదేరారు. ఇందుకు మద్దతు తెలుపుతూ మండలంలోని నాయకులు పాలేరు రామకృష్ణ, కరి శ్రీను, గుంజి వెంకట్రావు, కరి వీరాంజనేయులు, మార్క్, తాతయ్య, నాయకులు పాదయాత్రను ప్రారంభించారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి

– ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ తమ జీవితాన్ని ఆధ్యాత్మికత, సేవా దృక్పథం, ప్రేమతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సూచించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు పంటల మల్లారెడ్డి రచించిన సనాతన ధర్మం అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మంలో నిజాయితీ, జీవులకు హానికలిగించకుండా ఉండడం, స్వచ్ఛత, సద్భావన, దయ, ఓర్పు, సహనం, స్వీయనిగ్రహం, దాతృత్వం, సన్యాసం వంటి సద్గుణాలు ఉంటాయన్నారు. నేటి సమాజానికి హిందూధర్మం ప్రాముఖ్యతను పుస్తకం ద్వారా తెలియచేసిన మల్లారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

అవీఇవీ

ధాన్యం అమ్మకాలలో మోసం

బస్తాకు నాలుగు కేజీల చొప్పున అదనపు కాటా

వ్యాపారి మోసాన్ని గుర్తించి నిలదీసిన ముక్తేశ్వరం రైతులు

గుట్టుచప్పుడు కాకుండా రైతులకు డబ్బు చెల్లించిన వ్యాపారి

గతంలో తమ వద్ద కూడా అలానే చేసి ఉంటారని ఆందోళన



ముక్తేశ్వరంలో ధాన్యం కాటాలు వేస్తున్న కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రైతుల వద్ద ధాన్యం అమ్మకాలు చేసే సమయంలో బస్తాకు నాలుగు కేజీల వంతున కాటాలో ఓ వ్యాపారి మోసం చేస్తూ రైతులకు పట్టుబడ్డాడు. అందిన సమాచారం మేరకు... మండలంలోని వైదన గ్రామానికి చెందిన ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారి బుధవారం రాత్రి ముక్తేశ్వరం గ్రామంలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి 76 కేజీల వంతున కాటాలు వేసి లారీలో లోడ్ చేయించాడు. ఒక రైతుకు అనుమానం వచ్చి ధాన్యం బస్తా బరువు ఎక్కువగా ఉందని వేరే కాటా వద్దకు ధాన్యం బస్తాను తీసుకు పోగా అది 80 కేజీల బరువు తూగింది. దీంతో రైతు వెంటనే మరి కొన్ని బస్తాలను కాటా వేయగా అవి కూడా అలానే తూగాయి. తమను వ్యాపారి మోసం చేశారని గ్రహించి లారీని నిలిపివేశారు. దీనిపై గొడవ వద్దని ఆ వ్యాపారి చేసేది లేక నాలుగు కేజీల ధాన్యానికి డబ్బులు చెల్లించారు. గతంలో ఇదే గ్రామంలో 7 లారీల ధాన్యాన్ని ఆ వ్యాపారి కొనుగోలు చేశారు. అప్పట్లో ఆ రైతులను కూడా మోసగించి ఉంటారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దతు ధరకు కందులు కొనుగోలు



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణ శ్రీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కందులను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుకోలు చేస్తున్నట్లు మార్క్ ఫెడ్ జిల్లా మెనేజర్ కరుణశ్రీ తెలిపారు. గురువారం నాగులపాడు సొసైటీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కరుణశ్రీ మాట్లాడుతూ కందులు క్వింటాల్ ఒక్కటికి రూ.7550 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణ మాట్లాడుతు ఈ పంట నమోదైన రైతులకు రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు రిజిస్ట్రేషన్ చేసి, షెడ్యూల్ తెలియచేస్తారని తెలిపారు. బస్తాలు ప్రభుత్వమే సరఫర చేస్తుందని, రైతులు అందరు మద్దతు ధరకు పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేర్ హౌస్ మేనేజర్ రాంబాబు, ఎన్‌సీసీఎఫ్ అసిస్టెంట్ మేనేజర్ మనోజ్, ఎన్‌సీఎల్ క్యాలిటీ ఇన్‌స్పెక్టర్ గోవింద్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోషకాహారాన్ని తీసుకోవాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్

చినగంజాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.సాయిశ్రీ చరణ్ అన్నారు. చీరాల లోక్‌అదాలత్ ఛైర్మన్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రములను గురువారం సందర్శించి, విద్యార్థులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలల్లో 28 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించి, వారు వైద్యం ఎక్కడ పొందాలో వైద్యాధికారి సూచించారు. దివ్యాంగ విద్యార్థులు తప్పనిసరిగా సదరమ్ సరిఫ్టికెట్‌ను తీసుకోవాలని అన్నారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థినీవిద్యార్థిలకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో చీరాల లోక్ అదాలత్ కమిటీ మెంబరు ఆసోది రామకృష్ణారెడ్డి, మండల పారా లీగల్ ఆథారిటీ మెంబరు ఎంవీ.రామారావు, చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి, హెల్త్ విజిటర్ ఐ.ఉల్దారాణి, సీహెచ్‌వో విజయలక్ష్మి, ఆశాలు శారమ్మ, రోహిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

● డీఆర్వో చినఓబులేసు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్వో చిన ఓబులేసు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం సాయంత్రం పరీక్షలపై సమీక్షించచారు. జిల్లాలో 29,602 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా అందుకోసం 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓపెన్ స్కూలు సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు 1,564, మార్చి 3నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఈ సందర్భంగా డీఆర్వో దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై డీఆర్వో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బోల్తాపడిన కారును పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుచ్చుపొద వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఈప్రమాదం చోటుచేసుకుంది. పామూరునుంచి కందుకూరుకు వెళుతున్న కారు పెట్రోల్ బంకు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై పామూరుకు వస్తున్న లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన వేముల నివాస్ (44) అక్కడికక్కడే మృతిచెందారు. కారు సమీప పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. సీఐ ఎం.భీమానాయక్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతిని భార్య సుజాత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ దాసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాగితాలకే పరిమితమైన కొప్పెరపాడు పీహెచ్‌సీ

- భవనం లేక రెండేళ్లుగా గుంటుపల్లి పీహెచ్‌సీలోనే ఆ ఇద్దరు వైద్యుల విధులు
- వైద్య సేవల కోసం తొమ్మిది గ్రామాల ప్రజల ఎదురుచూపులు
- ఉన్నతాధికారులు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని ప్రజల విజ్ఞప్తి

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల జనాభా పెరగడంతో రెండేళ్ల కిందట ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మండలానికి మరో పీహెచ్‌సీని మంజూరు చేసింది. గుంటుపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా, కొప్పెరపాడు గ్రామానికి మరో పీహెచ్‌సీని మంజూరు చేసి ఇద్దరు వైద్యులను నియమించారు. రెండేళ్ల నుంచి అక్కడ భవనం లేక పోవడం, నూతన భవనాల కోసం స్థలం ఎంపిక చేయక పోవడంతో గుంటుపల్లి పీహెచ్‌సీలోనే నూతనంగా మంజూరైన పీహెచ్‌సీ పనిచేస్తుంది. దీంతో తమకు కేటాయించిన వైద్యశాల కాగితాలకే పరిమితం అయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ మండలంలో సుమారు 60వేల జనాభా ఉంది. వీరికి వైద్య సేవలు అందించాలంటే గుంటుపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరిపోవడం లేదని ప్రభుత్వం 2023 మేలో కొప్పెరపాడు



గుంటుపల్లి పీహెచ్‌సీలోనే కొనసాగుతున్న కొప్పెరపాడు పీహెచ్‌సీ సేవలు

గ్రామానికి రెండో పీహెచ్‌సీని మంజూరు చేసింది. ఈ పీహెచ్‌సీ ద్వారా కొప్పెరపాడు, గుడిపాడు, కూకట్లపల్లి, గొర్రెపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, కొమ్మినేనివారిపాలెం, వైదన వల్లాపల్లి గ్రామాలకు వైద్య సేవలు అందాల్సి ఉంది. కానీ ఇంత వరకు నూతన పీహెచ్‌సీని కొప్పెరపాడులో ప్రారంభించలేదు. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు, సిబ్బంది కేటాయించిన అక్కడ భవనం లేక వారు గుంటుపల్లి పీహెచ్‌సీ వరకు మాత్రమే వచ్చి వెళుతున్నారు. అక్కడే విధుల నిర్వహిస్తున్నారు. జీతాల కూడా కొప్పెరపాడు పీహెచ్‌సీ పేరుపైనే తీసుకుంటున్నారు. కానీ ఇంతవరకు అక్కడ నూతన భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. నూతన భవనాలకు నిధులు మంజూరై ఉన్న స్థలం లేక రెండేళ్ల నుంచి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని తాత్కాలికంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలలో పీహెచ్‌సీని ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని తొమ్మిది గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులొస్తే పరుగులు

కొప్పెరపాడులో పీహెచ్‌సీ ఉంటే సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగం. జ్వరం వచ్చినా గ్రామాల ప్రజలు పదిహేను కిలోమీటర్ల దూరం ఉన్న గుంటుపల్లి పీహెచ్‌సీకి వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు వస్తే ప్రజలు పట్టణ ప్రాంతాలకు పరుగు పెడుతున్నారు. వైద్యులుండి, సిబ్బంది ఉండి కొప్పెరపాడులో నూతన పీహెచ్‌సీ ఏర్పాటు గురించి అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన పలు భవనాలు ఖాళీగా ఉన్నాయని వాటిలో పీహెచ్‌సీని ఎందుకు నడపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగితాలకే పరిమతమైన నూతన పీహెచ్‌సీని వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కార్మికులు

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మునిసిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత, భరోసా కల్పించి టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరై కార్మికుల సమస్యలను ఉద్దేశించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానం అమల్లోకి వచ్చిఉంటే జీవితాలు దయనీయంగా మారేవన్నారు. ఈక్రమంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 20, 21 తేదీలలో ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేయడంతో పాటు 24న ముఖ్యమంత్రికి ఉత్తరాలు పంపడం, 25, 26 తేదీలలో మునిసిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్.బాబూరావు, వీరాస్వామి, ఇమ్మానియేల్, క్రాంతిసాగర్, రాంబాబు, నాగేశ్వరరావు, చాంద్ బాషా, సురేష్, రంజిత్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, కుమారి, సంధ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యతో పిల్లల సర్వతోముఖాభివృద్ధి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చినగంజాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి అంగన్‌వాడీ విద్య ఎంతో ఉపయోగమని మండల విద్యాశాఖాధికారి-1 బి.అజయ్‌బాబు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు మంచి పునాది వేయాలని అన్నారు. చిన్నతనం నుండే మంచి అలవాట్లు నేర్పించాలని సూచించారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధిపై రోల్‌ప్లే చేసి డెమో ప్రదర్శించారు. డీఆర్‌పీలు శ్రీనివాస రెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఎంఈవో కె.నాగభూషణం అన్నారు. పంగులూరు విద్యావనరుల కేంద్రంలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా బోధనాంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా పిల్లలకు మంచి అలవాట్లతో పాటు అక్షర జ్ఞానంతో పాటు సంఖ్యా పరిజ్ఞానం అందించాలన్నారు. ఆటలు, పాటలతో ఆసక్తికరంగా బోధన చేయాలని సూచించారు. రీసోర్స్ పర్సన్స్‌గా ఓ.ప్రతాప్, సుబ్బారావు, శ్రీధర్‌తో పాటు సూపర్‌వైజర్ పద్మజ వ్యవహరించారు. మండలంలోని 54 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలి



సమావేశంలో పాల్గొన్న డీపీవో కుమారస్వామి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ

యద్దనపూడి, (వవారప్పారం) ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలుపై దృష్టిసారించాలని డీపీవో కుమారస్వామి పంచాయతీ కార్యదర్శులను కోరారు. ఆయన గురువారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ క్యాదర్శులతో సమావేశమయ్యారు. సమావేశానికి ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ యద్దనపూడి మండలంలో వివిధ గ్రామాలలో ఇంటి పన్ను బకాయిలపై కార్యదర్శులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా చెత్త సంపద కేంద్రాలు నిర్వహణ తీరును కూడా అడిగి తెలుసుకున్నారు. మార్చి ఆఖరులోపు వీలైనంత ఎక్కువగా ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నులను వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్‌డీ కృష్ణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలతో పేదరిక నిర్మూలన

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పొదుపు సంఘాలు బాగుంటే పేదరిక నిర్మూలన సాధ్యమని వెలుగు ఏపీఎం రాజారావు పేర్కొన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ జరిగింది. ఈసందర్భంగా వీవోల నుంచి వచ్చిన మహిళలను గ్రుపులుగా చేసి పేదరిక నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యల గురించి వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎం తెలిపారు. ఈ శిక్షణలో సీసీ పేరయ్య పాల్గొన్నారు.


శ్మశానవాటికకు నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

ఎస్సీ శ్మశాన వాటికకు తీరిన దారి కష్టాలు

- ఉపాధి ద్వారా సీసీ రోడ్డు
- మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారి లేక బల్లికురవ ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎస్సీ కాలనీ వాసులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి శ్మశాన వాటిక వద్ద గల ఇబ్బందులను తీసుకు వెళ్లారు. మంత్రి రవికుమార్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పపథకం నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బల్లికురవ ఎస్సీ శ్మశాన వాటికకు సర్పంచ్ పందిరి అంజిబాబు సహకారంతో మట్టి రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేశారు. గతంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించాలంటే నరకయాతన అనుభవించే వారిమని ఇప్పుడు శ్మశానవాటిక స్థలంలో మెరక మట్టిని తోలించడంతో పాటు దారి సమస్య లేకుండా సీసీ రోడ్డు వేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి రవికుమార్‌కు ఎస్సీ కాలనికి చెందిన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాలి

పంగులూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ ద్వారా పనులు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. కార్యాలయంలో ఉపాధి పథకం పనుల నిర్వహణపై గురువారం విలేకరులతో మాట్లాడుతూ పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలో 25 నీటి కుంటలు, 150 ఇంకుడు గుంటల నిర్మాణం టార్గెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన చేపట్టి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. పనికి వచ్చే కూలీలకు కొలతల ప్రకారం పని చూపించి తగిన కూలి అందేలా చర్యలు చేపట్టాలని, కూలీలు కొలతల ప్రకారం పని చేసే విధంగా టి.ఎ.లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని కోరారు. పనికి హాజరయిన వారికే మస్టర్ వేయాలని, ఎలాంటి అవినీతికి చోటు లేకుండా పనులు జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సంతోషం పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఏపీఎం మోహనరావు, పాల్గొన్న ఎంపీడీవో నేతాజీ, తహసీల్దార్ నాగరాజు, పార్టీ నేతలు

కొడవలివారిపాలెం (పర్చూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సబ్‌ప్లాన్ నిధులు, రుణాలను సద్వినియోగం చేసుకొని ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కారంచేడు ఏపీఎం మోహనరావు కోరారు. కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెం గ్రామంలో మంజూరైన రూ.25లక్షల చెక్కులను గురువారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, తహసీల్దార్ నాగరాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీహరి, మండల జనరల్ సెక్రటరీ షేక్ ఖాశిం, సీనీలు సుబ్బారావు, ఇస్సాక్ పాల్గొన్నారు.

నేడు వైదనలో మంత్రి గొట్టిపాటి పర్యటన

రూ.50లక్షలతో షాదీఖానాకు భూమి పూజ

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన మంజూరైన రూ.50లక్షల నిధులతో నిర్మించనున్న షాధిఖానాకు మంత్రి భూమి పూజ చేయనున్నారు. అలానే గ్రామంలో ఉపాధి పథకంలో రూ.20లక్షలతో ఇటీవల నిర్మాణం చేపట్టిన సిమెంట్ రోడ్లను అయన ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా గ్రామ టీడీపీ నేతలు పోగుల శేఖర్ షాదీఖానా వద్ద ఏర్పాటు చేస్తున్న శిలాఫలకం పనులను గురువారం పరిశీలించారు.


షాదీఖానా వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేయిస్తున్న టీడీపీ నాయకులు

పదవ తరగతి పరీక్షల్లో జాగ్రత్తలు పాటించండి

రీజనల్ ఎడ్యుకేషనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుంచి 31 వరకు జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో జాగ్రత్తలు పాటించాలని ఎడ్యుకేషనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో పరీక్ష కేంద్రాల చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, రూట్ అధికారులు, కస్టోడియన్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణ, తగిన ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. జిల్లాలో 103 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 16361 మంది రెగ్యులర్, 438 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, గంగాధరరావు, సురేష్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, శ్రీనివాస్, ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించిన లెఫ్టినెంట్ కల్నల్ పరమార్, సబ్ మేనేజర్ ముకేశ్ కుమార్

మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

మార్టూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో నూతన ఎన్‌సీసీ యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. చీరాల 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎన్ఎస్ పరమార్ జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ జెండాను ఎగురవేసి నూతన యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఏడాదికి 50 మంది బాలబాలికలకు ప్రవేశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సబ్ మేనేజరు ముకేశ్ కుమార్, వలపర్ల ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మార్టూరు హైస్కూల్‌లో ఎన్‌సీసీ కేర్ టేకర్ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్‌మిల్టన్, శివ రామకృష్ణ, గిరి, చట్టి శ్రీను పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఉచిత కంటి శిబిరాన్ని వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ చీరాల ప్రతినిధులు తెలిపారు. వచ్చే ఆదివారం క్లబ్ సమావేశం హాలులో రోటరీక్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర్ కంటి హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు క్యాంపు ఉంటుందని పరీక్షలు అనంతరం శుక్లాలు ఉన్న వారికి గుంటూరుకు తరలించి చికిత్స అనంతరం వారి వాహనంలోనే అదేరోజు తిరిగి చీరాలకు చేర్చనున్నట్లు వివరించారు. వైద్య సాయం అవసరమున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. వివరాలకు 92913 02001, 89191 88089 నెంబర్‌లను సంప్రదించాలని చెప్పారు.

23న రాజుబంగారుపాలెంలో ఉచిత వైద్య శిబిరం

చినగంజాం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రా - ధా - స్వ - ఆ - మీ సత్సంగం (దయాల్బాగ్) ఒంగోలు బ్రాంచి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉచిత మల్టీ స్పెషాలటీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దయాల్బాగ్ రాజుబంగారుపాలెం సెంటర్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

జిల్లా రీసెర్చి స్టేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ మధు


మాట్లాడుతున్న జిల్లా రీసెర్చ్ సైంటిస్ట్ మధు, ఏడీఏలు మోహనరావు, రత్నకుమారి, ఏవో రామ్మోహన్‌రెడ్డి


పర్చూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలతోపాటు, పంట మార్పిడి విధానాన్ని తప్పక పాటించాలని బాపట్ల జిల్లా రీసెర్చి స్టేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ మధు అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రైతులు, పురుగు మందు డీలర్లతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న సైంటిస్ట్ మాట్లాడుతూ నేల స్వభావాన్ని ముందుగానే తెలుసుకున్నపుడు ఎలాంటి పంటలను సాగుచేసుకోవాలో తెలుస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి మాట్లాడుతూ రైతులు వేసవి దుక్కి దున్నుకోవాలని, విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మోహనరావు, ఎవో రామ్మోహన్‌రెడ్డి, బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ టి.రత్నకుమారి, టీవీ రామారావు, రైతులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న యువత

పోలీసులకు పలువురి ఫిర్యాదు


అద్దంకి పట్టణంలో పోతురాజు గండి వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతంలో నిలిచిన వాహనాలు

అద్దంకి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలువరు యువకులు మోటార్ సైకిళ్లను ఇష్టానుసారంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం అద్దంకి పట్టణంలోని పోతురాజు గండి వద్ద కోటేశ్వరరావు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా యువకుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఈ విషయాన్ని కోటేశ్వరరావుతో పాటు అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మరి కొందరితో కలిసి వెళ్లి సీఐ సుబ్బరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. యువత మోటార్‌సైకిళ్లను ఇష్టానుసారంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాజు తెలిపారు. యువత ఇష్టానుసారంగా వాహనాలు నడిపితే తల్లిదండ్రులతో పాటు మోటార్‌సైకిల్ యజమాని కూడా శిక్షార్హులవుతారని తెలిపారు.



యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు